

అర్హులకు అన్యాయం...



- వికలత్వం ఉన్నా పెన్షన్ నిలుపుదల
- వికలాంగుల్లో నోటీసుల భయం..
- జిల్లాలో 4080 మందికి నోటీసులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరగని శాఖంటూ లేదంటే అతిశయోక్తి లేదేమో. ప్రభుత్వం పంపిణీ చేసే సామాజిక పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లలో లబ్ధిదారుల విషయంలో అనేక ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో పలువురు వైసీపీ నాయకులు డాక్టర్లతో కుమ్మక్కై వికలత్వం తక్కువగా ఉన్నా, కొందరికి అసలే వికలత్వం లేకపోయినా వికలాంగుల సర్టిఫికెట్లు జారీ చేయించారు. దీంతో జిల్లాలో వందలాదిమంది బోగస్ వికలాంగులు దర్జాగా పెన్షన్ తీసుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బోగస్ పెన్షన్ లబ్ధిదారుల కథ తేల్చాలని నిర్ణయించుకుంది. దీంతో వికలత్వ పెన్షన్లపై పూర్తి స్థాయిలో సర్వే చేపట్టింది. ఇందులో భాగంగా ఇటీవల జిల్లాలో 4080 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో వీళ్లు సమర్పించిన వికలత్వ సర్టిఫికెట్‌లో ఉన్న వికలత్వ శాతానికి, తర్వాత జరిగిన విచారణలో తేలిన వికలత్వానికి తేడా ఉండడంతో పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. అయితే ఇందులో పలువురు అర్హులైన లబ్ధిదారులు కూడా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచీ పెన్షన్ తీసుకుంటున్న వారికీ ఇప్పుడు రద్దు చేశారు. దీంతో అర్హులైన వికలాంగ పెన్షన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సందర్భంగా పలువురు అర్హులైన లబ్ధిదారులతో ఆంధ్రజ్యోతి మాట్లాడింది.


● సంబేపల్లె మండలానికే చెందిన పోరెడ్డి కుమారికి 2004 నుంచి వికలత్వ పెన్షన్ వస్తోంది. పుట్టుక నుంచి పోలియో వచ్చి ఒక కాలు వికలత్వానికి గురైంది. దీంతో నడవడం కష్టంగా ఉంది. ప్రస్తుతం ఈమెకు కూడా పెన్షన్‌ను నిలిపేశారు.



- పోరెడ్డి కుమారి

● సంబేపల్లె మండలం పాలెంగడ్డ పాపన్నగారిపల్లెకు చెందిన జయచంద్ర కుమారుడు బాబు. ఇతను 100 శాతం మెంటల్లీ డిజేబుల్. అదే మండలంలో నరసింహులు అనే వ్యక్తికి చెందిన కొడుకు మణికంఠకు 90 శాతం మెంటల్లీ డిజేబుల్. అయితే వీళ్లిద్దరికీ వికలత్వం తక్కువగా ఉందంటూ అధికారులు పెన్షన్‌ను నిలిపేశారు.

వికలాంగుల పెన్షన్ల విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన కొన్ని పాపాలను వెలికితీసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సర్వే వల్ల జిల్లాలో ప్రస్తుతం వికలాంగులను నోటీసుల భయం వెంటాడుతోంది. పూర్తి స్థాయిలో వికలత్వం ఉన్నా మీకు తక్కువ శాతం ఉందని, మీ పెన్షన్ నిలిపివేస్తున్నామని అధికారులు ఇచ్చిన నోటీసులతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఏళ్ల తరబడి పెన్షన్ తీసుకుంటున్న తమకు ఒక్కసారిగా పెన్షన్ నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు.



● చిన్నమండెం మండలం దేవగుడిపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన గుర్రంకొండ వెంకటశివ ప్యాసింజర్ ఆటో పెట్టుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి నాలుగు సంవత్సరాల క్రితం రెండు చేతులు, రెండు కాళ్లకు పెరాలసిస్ రావడంతో మంచానికి పరిమితమయ్యాడు. ఇంటి పెద్ద మంచానికి పరిమితం కావడంతో భార్య కొడుకు ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఉన్న డబ్బు ఖాళీ అయింది. కూలీ చేసుకుని జీవనం సాగించాలి. ఆయన పూర్తి స్థాయిలో మంచానికే పరిమితం కావడంతో అతని దగ్గర క్రమం తప్పక ఒక మనిషి ఉండాల్సి వస్తోంది. రెండు సంవత్సరాల నుంచి పెన్షన్ వస్తుండడంతో కనీసం ఆయన మందులకు ఎంతో కొంత ఆసరాగా ఉండేది. ఇతనికి కూడా ప్రస్తుతం పెన్షన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు అందచేశారు.



- మంచానికే పరిమితమైన వెంకటశివయ్య

● సంబేపల్లె మండలం కేతిరెడ్డిగారిపల్లెకు చెందిన మద్దె చంద్రశేఖర్ వయస్సు 13.. ఇతనికి పుట్టుక నుంచి పోలియో (ఆర్థో పెడికేర్ ఇంప్లిమెంట్ డిజేబుల్). అతనికి 8 ఏళ్ల వయస్సు నుంచీ వికలత్వ పెన్షన్ వస్తోంది. ఇప్పటికీ తల్లి నాగరత్న, తండ్రి భాస్కర్ సహాయం లేనిదే నడవలేడు. కనీసం నిలబడేందుకు కూడా కష్టమే. ఇప్పటికీ ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. ప్రస్తుతం సర్వేలో ఇతనికి వికలత్వం 40 శాతం కంటే తక్కువగా ఉందని పెన్షన్‌ను నిలిపివేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అధికారుల వద్దకు వచ్చి తమ గోడును వినిపించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



- చంద్రశేఖర్

సర్వే ప్రకారమే పెన్షన్ రద్దు

గత ప్రభుత్వంలో ఇచ్చిన పెన్షన్లలో అనర్హులు ఉన్నారని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేయించింది. ఇందులో తేలిన ప్రకారం తక్కువగా వికలత్వం ఉన్న వారికి పెన్షన్ రద్దు చేస్తూ నోటీసులు ఇచ్చారు. అయితే అర్హులు ఆందోళన చెందాల్సిన పని లేదు. అర్హులైన వాళ్లు ఎంపీడీవో కార్యాలయంలో తమ వద్ద ఉన్న పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత మరోసారి వికలత్వ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అర్హులకు పెన్షన్లు ఇస్తారు.

-సత్యనారాయణ, పీడీ, డీఆర్‌డీఏ

నలుగురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల తొలగింపు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లుగా పనిచేస్తున్న నలుగురిని తొలగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లలో వివిధ తేదీల్లో రూ.40 వేల గౌరవ వేతనంతో నియమించిన ఈ నలుగురు ఏపీపీలను తొలగించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ చేసిన సిఫారసుల ఆధారంగా ప్రభుత్వం వీరిని తొలగించింది. రాయచోటి ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న టి.జగన్మోహన్‌రెడ్డి, మదనపల్లె ఏడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) కోర్టులో ఉన్న వి.జయనారాయణరెడ్డి, కడప ఆరవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు (ఫ్యామిలీ కోర్టు)లో పనిచేస్తున్న ఏపీపీ డి.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కడప మహిళా, ఏడవ సెషన్స్ జడ్జి కోర్టులో ఏపీపీగా ఉన్న మొఘల్ యాస్మీన్‌బేగంను తొలగించారు. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం వేర్వేరుగా ఆదేశాలు జారీ చేశారు.

పోక్సో కేసులో ప్రత్యేక న్యాయవాది

కడప పోక్సో ప్రత్యేక కోర్టులో ఒక పోక్సో కేసులో ప్రాసిక్యూషన్‌కు సహకరించడానికి కడప బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ఉన్న డి.రెడ్డెయ్యను ప్రత్యేక కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. క్రైం నెంబరు 231/2024తో ఈ కేసు బద్వేలు పోలీసుస్టేషన్‌లో నమోదైంది. డీజీపీ నివేదిక మేరకు నియమిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



పట్టాభి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామాలయంలో బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ మొదలుకుని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేష పూజలు జరిగాయి. భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు విశేషాలంకరణలు చేసి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో తీర్చిన కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాల ఘోష, వేదపండితుల మంత్రోచ్చారణలు విశేష భక్తుల నడుమ సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. వేడుకలలో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం జరిగింది. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, వేదపండితులు, కృష్ణరాజుభట్టార్, అర్చక బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యధావిధిగా రైళ్ల రాకపోకలు

ములకలచెరువు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం నుంచి ములకలచెరువు మీదుగా నరసాపూర్‌కు ప్రతిరోజూ నడిచే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి యధావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. గుంటూరు సమీపంలోని పెదవడ్లపూడి-దుగ్గిరాల, తెనాలి-చందూరు రైల్వే సెక్షన్‌లో మూడవ రైలు మార్గంలో పనుల కారణంగా రెండు రైళ్లను ఈనెల 12వ తేదీ నుంచి పాక్షికంగా రద్దు చేశారు. దీంతో వారం రోజుల పాటు నరసాపూర్-ధర్మవరం (17247), ధర్మవరం-నరసాపూర్ (17248) ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడవలేదు. పనులు పూర్తి కావడంతో రైళ్లు యధావిధిగా నడుపుతున్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు బుధవారం ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కదిరిదేవరపల్లె నుంచి తిరుపతికి ప్రతిరోజూ రాత్రి నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు రాత్రి 11.04 గంటలకు రావాల్సి ఉండగా తెల్లవారుజామున 1.29 గంటలకు వచ్చింది. ఈ రైలు సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. అలాగే సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే ఏడు కొండలు ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా తెల్లవారుజామున 4.11 గంటలకు వచ్చింది. అలాగే మరో మూడు ప్యాసింజర్ రైళ్లు కూడా గంటకుపైగా ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.



షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

● జాతీయ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

తంబళ్లపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మహమ్మద్ అజహర్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీ లత తెలిపారు. జిల్లా షూటింగ్‌బాల్ అసోషియేషన్ కన్వీనర్ సురేష్‌బాబు, జిల్లా కార్యదర్శి గౌతం, ఏపీ షూటింగ్‌బాల్ కార్యదర్శి పరశురాముడు నుంచి ఎంపిక ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26 తేదీలలో మదనపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అజహర్ పాల్గొని సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో బిహార్ రాష్ట్రం బుద్ధగయలో జరిగే 44వ జాతీయ స్థాయి పోటీలలో అజహర్ పాల్గొంటాడని పీడీ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అజహర్‌ను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్, పీడీ, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



మహమ్మద్ అజహర్

బొప్పాయి ధర పెంచేలా చూడండి

● తహసీల్దార్‌ను కోరిన రైతు సంఘం నాయకులు



తహసీల్దార్ అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బొప్పాయికి టన్ను ధర రూ.10 వేలు ఇచ్చేలా చూడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు లింగాల యానాదయ్య, ఏపీ రైతు సంఘం నాయకుడు ఆదినారాయణతో పాటు రైతులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులు బొప్పాయి టన్ను ధర మొదట్లో రూ.7 వేలు ఇచ్చేవారని, ప్రస్తుతం దానిని రూ.8 వేలకు పెంచారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను కూడా వ్యాపారులు పాటించడం లేదని చెప్పారు. ఒకవైపు వర్షాలు పడుతున్నా వ్యాపారులు తోటల్లో కాయలు కోశారని, ఇతర రాష్ట్రాల్లో ధరలు లేకుంటే కాయలు ఎందుకు కోస్తారని ప్రశ్నించారు. నాయకులు, రైతులు ఇచ్చిన వివరాల మేరకు తహసీల్దార్ కొందరు దళారులతో వారి ఎదుటే ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం టన్ను బొప్పాయి కాయలకు రూ.9 వేలకు తగ్గకుండా ఇవ్వాలని, ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు శివక్రిష్ణ, కొత్తపల్లె ఈశ్వరయ్య, జగదీశ్, శివారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో బుధవారం వైభవంగా తిరుప్పావడ సేవ కార్యక్రమాలు ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరణలు చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పులిహోరాను ఏరు శిఖరాలుగా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అర్చకుడు గోవర్ధన్ భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ ఈవో రమణ, మాజీ ఆలయ కమిటీ అధ్యక్షుడు బింగి పాండు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ

24 నుంచి కోదండరామాలయంలో పవిత్రోత్సవాలు

ఒంటిమిట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు, సిబ్బంది వల్ల తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటి కారణంగా ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా నివారించేందుకు ఆలయంలో ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 24వ తేదీ ఉదయం చతుష్టార్చన, పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం పవిత్రోత్సవం, నివేదన శాత్తు మొర కార్యక్రమాలు జరుగనున్నాయి. 25న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమం నిర్వహిస్తారు. 26న ఉదయం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, సాయంత్రం సీతారామ లక్ష్మణ సమేత కోదండరాముల వారి ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. భక్తులు పవిత్రోత్సవాల కార్యక్రమానికి వచ్చి కోదండరాముని ఆశీస్సులు పొందాలని అధికారులు తెలిపారు.



పవిత్రోత్సవాలకు సిద్ధం చేస్తున్న యాగశాల

రెవెన్యూ అధికారులు నిబద్ధతతో పనిచేయండి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులు, భూముల రీసర్వే, రికార్డుల అప్డేషన్ తదితర రెవెన్యూ అంశాల్లో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని శ్రీసాయిశుభ ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, ఎగ్జిక్యూటివ్ మెజిస్టీరియల్ పవర్స్, భూమి రికార్డుల శుద్ధి, భూఆక్రమణల నివారణ, ప్రజలతో వ్యవహరించే విధానం, పాత భూ వివాదాల పరిష్కారం తదితర అంశాలపై రెవెన్యూ అధికారులకు నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన సమస్యల పరిష్కారంపై ఎన్నో మార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది వీఆర్‌వోల్లో మార్పు కనిపించడం లేదన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఏమిటని కలెక్టర్ ప్రశ్నించారు. జిల్లాలో రీసర్వే, జాయింట్ ఎల్పీయంల సమస్యలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో 965 కుటుంబాల వారు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. సంబంధిత బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని కలెక్టర్ తెలిపారు. ఇకపై రెవెన్యూ అంశాలపై ఆడిట్ నిర్వహిస్తామని, లోపాలు బయటపడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాగులు, వంకలు, ఇతర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించడం రెవెన్యూ అధికారుల బాధ్యత అని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్‌గా చమర్తి

● అధికారికంగా ప్రకటించిన సీఎం చంద్రబాబు

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వ్యవహారానికి ఎట్టకేలకు తెరపడింది. బుధవారం రాత్రి విజయవాడలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు సీఎం చంద్రబాబు రెండు నియోజకవర్గాల నేతల సమావేశంలో పార్టీ నేతలను అభినందించారు. అలాగే రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా చమర్తి జగన్‌మోహన్‌రాజును ప్రకటించారు. దీంతో ఏడాదిగా సాగుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ పదవిపై సస్పెన్షన్ వీడింది. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన రాజంపేట అభ్యర్థి బాలసుబ్రమణ్యం వైసీపీలో చేరిపోవడంతో ఇన్‌చార్జ్ పదవి సస్పెన్షన్‌గా కొనసాగింది. అయితే ఎన్నికలకు ముందు నుంచి టీడీపీ కోసం కృషి చేసి ఆర్థికంగా పార్టీని ఆదుకుంటూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకున్న జగన్‌మోహన్‌రాజు ఇటు మహానాడులోనూ, ఒంటిమిట్ట ఎన్నికల్లోనూ కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా కొనసాగుతున్న చమర్తిని రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించారు. బుధవారం రాత్రి చమర్తి ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ తనను రాజంపేట ఇన్‌చార్జ్‌గా ప్రకటించినందుకు సీఎం చంద్రబాబుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో టీడీపీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని తెలిపారు.



జగన్‌మోహన్‌రాజును అభినందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి

● మెట్టసోంపల్లెలో విషాదఛాయలు



అవుల శంకర (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఓ గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతిచెందిన విషాదకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. దేవప్పకోట పంచాయతీ మెట్ట సోంపల్లెకు చెందిన అవుల రామప్ప కుమారుడు అవుల శంకర (55) సోమవారం గొర్రెలను మేపుకునేందుకు మెట్టసోంపల్లె గ్రామ శివారులో ఉన్న ఏటి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఏటిలో పడిపోయాడు. పక్కనే గొర్రెలను మేపుకుంటున్న మహిళలు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. హుటాహుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని పీటీఎం పోలీసులకు తెలియజేశారు. ఎస్‌ఐ హరిహరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో ఏటిలో గాలించారు. సాయంత్రం 7గంటలకు బయటకు వెలికితీయగా, శంకర అప్పటికే మృతిచెందాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మెట్టసోంపల్లెకు తరలించారు. శంకర మృతితో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు మల్లికార్జున ఉన్నారు.

రెండురోజుల జాతీయస్థాయి శిక్షణ



సర్టిఫికెట్ అందుకుంటున్న శివనారాయణగౌడ్

చిట్వేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్‌ఐఆర్) వారు జిగ్యాస కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.శివనారాయణగౌడ్ బెంగుళూరులోని జాతీయ వైమానిక అంతరిక్ష ప్రయోగశాలలో ఏరోడైనమిక్స్, విమాన విడిభాగాలు, నానో మెటీరియల్స్ పైన 2 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సంస్థ డైరెక్టర్ జిగ్యాస మోడల్ అధికారి డాక్టర్ వీపీఎస్ నాయుడు ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, ఉపాధ్యాయ సిబ్బంది శివనారాయణగౌడ్‌ను అభినందించారు.

లేగ దూడల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

● డీఏహెచ్‌ఓ గుణశేఖర్



దూడల ప్రదర్శనలో గుణశేఖర్, పాడిరైతులు

కలకడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): లేగ దూడల సంరక్షణపై పాడి రైతులు శ్రద్ధ చూపాలని డీఏహెచ్‌వో గుణశేఖర్ అన్నారు. మండలంలోని నడిమిచెర్లలో బుధవారం నిర్వహించిన మేలుజాతి దూడల ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ పశుపోషణను ఎంచుకొని జీవనాధారం సాగించే రైతులు నికరాదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ పథకాలైన పశుబీమా, లింగ నిర్ధారణ వీర్యం, పశుగ్రాస విత్తనాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన 52 లేగ దూడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన దూడల యాజమానులు నాగేంద్రరెడ్డి, నిరంజన్, రెడ్డిశేఖర్‌రెడ్డిలకు బహుమతులు అందజేశారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్, మందులను పంపిణీ చేశారు. అధికారులు సుబ్బారావు, శశికళ, పూర్ణిమ, తేజకల్యాణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ చేయకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ తాత్కాలికంగా తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ కార్యదర్శి పి.ఓబులమ్మ, గాలివీడు మండలం నూలివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజనేయులునాయక్, వీరబల్లి మండలం ఓదివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రహిమాన్, చిన్నమండెం పడమటికోన గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.జమీర్‌హుసేన్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

హత్యకేసులో ఇద్దరు నిందితులు అదుపులోకి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సీటీఎం గ్రామం, రైల్వేస్టేషన్ సమీపంలో బ్రిడ్జి వద్ద అనుమానాస్పద కేసులో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఖదీర్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కదిరి రైల్వే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసి హత్య చేసిన నిందితులను ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిని కదిరి రైల్వే పోలీసుస్టేసన్ తరలించినట్లు తెలిసింది.

పశువైద్యశాల వెటర్నరీ ఆఫీసర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించినందుకు ముమ్మడిగుంటపల్లె పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ బి.చంద్రకిషోర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. బుధవారం విజయవాడలోని పశువైద్యశాలలో సంచాలకులు దామోదర్ నాయుడు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెటర్నరి ఆఫీసర్ చంద్రకిషోర్

80 ఏళ్లుగా మట్టిరోడ్లే గతి

● పట్టించుకోని పాలకులు
● వర్షం వస్తే నరకమే..
● ఇబ్బందుల్లో వృద్ధులు, విద్యార్థులు
● ఎన్నికల హామీలు ఏమయ్యాయి ?



మొరవపల్లెకు వెళ్లే హంద్రీనీవా కాలువగట్టు రహదారి

పీలేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్లు వ్యయం చేస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా మీఊరి రోడ్డు వేయిస్తామని లెక్కలేనన్ని సార్లు హామీలు గుప్పించారు తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో నేటికీ పలు గ్రామాలు రహదారి వసతికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా తమ గతి ఇంతేనంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం వస్తే ఎంత అత్యవసరమైనా ఊరు నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాలంటే గగనమే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నాలుగు గ్రామాలు నేటికీ రహదారి వసతికి నోచుకోకపోవడం శోచనీయం. నిత్యం రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సమస్యల సంద్రంలో బతుకు బండి లాక్కొస్తున్నారు.

పీలేరు మండలం జాండ్ల పంచాయతీ పరిధిలోని గుట్టకిందల్లె, ఎస్టీ కాలనీ, గుట్టకిందపల్లె, హరిజనవాడలో సుమారు 120 కుంటుంబాలు జీవిస్తున్నారు. పీలేరు-తలపుల రహదారి మార్గం లోని బసిరెడ్డిగారిపల్లె క్రాస్ నుంచి ఎస్టీ కాలనీ మీదుగా హరిజనవాడకు నాలుగు కి.మీ. మట్టిరోడ్డు ఉంది. అలాగే బాలంవారిపల్లె పంచాయతీ పరిధి లోని నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లె మీదుగా అక్కిసేనువారిపల్లె, చిచ్చిలవారిపల్లె వరకు 4 కి.మీ. మట్టిరోడ్డే గతి. ఇరు పంచాయతీల్లో రహదారి వేయాలని ఐదేళ్లకోసారి ఓట్ల కోసం వచ్చే ప్రముఖ రాజకీయ పార్టీ నేతల దృష్టికి తేవడం, అధికారంలోకి వచ్చిన వెంటనే అటకెక్కడం పరిపాటిగా మారింది. నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లెకు రెండు కి.మీ. హంద్రీనీవా కాలువ గట్టుపైనే వెళ్లాల్సిన దుస్థితి. ఇక్కడ 45 కుటుంబాలు నివసిస్తున్నారు. రాత్రి వేళల్లో వెళ్లాలంటే బిక్కుబిక్కు మంటూ ప్రణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. వర్షం వస్తే ఈ గ్రామాల ప్రజలు పడే ఇక్కట్లు వర్ణణాతీతం. దారి పొడవునా బురద, గుంతల మయై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. కనీసం ఆటో రమన్నా వచ్చే పరిస్థితి లేదు. నిత్యం ఈ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు నడుచుకొని రావాల్సిందే. ఇక రైతులు, వృద్ధులు, మహిళల, రోగుల పరిస్థితి చెప్పనక్కరలేదు. దశాబ్దాలు గడుస్తున్నా రహదారి వసతికి నోచుకోకపోవడం శోచనీయం.



గులకరాళ్లు, గుంతలమయమైన గుట్టకిందపల్లె రహదారి

ఆటో వెళితే నాలుగు పంక్చర్లు



పీలేరు నుంచి గుట్టకిందపల్లెకు ఒక్కసారి వెళ్లొస్తే ఆటోకు నాలుగు పంక్చర్లు వేయాలి. ఇచ్చే బాడుగ కన్నా పంక్చర్లకు అయ్యే ఖర్చే ఎక్కువ. దారి పొడవునా గులకరాళ్లు, గుంతలమయం. పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన దాఖలాలు లేవు. ఇక ఎంతకాలం ఈ ఇక్కట్లు.

- బి.నాగరత్నంనాయక్, ఎస్టీ కాలనీ, పీలేరు మండలం

రెండు కిలోమీటర్లు నడవాలి



మా బిడ్డలు బడికి వెళ్లాలంటే రెండు కి.మీ. నడిచి వెళ్లాలి. రోడ్డు వేయనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఓట్ల కోసం వచ్చే నాయకులు అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన పాపాన పోలేదు. ఎన్నో ఏళ్ల నుంచి అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతా కూలీ నాలి చేసుకొని బతుకుతున్నాం. ఎప్పుడేస్తారో ఏమో.

- సుప్రియ, మొరవపల్లె, పీలేరు మండలం

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు వేయాలని చాలా ఏళ్లగా అడుగుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికలు అయిన వెంటనే వేయిస్తాం అంటున్నారు తప్ప వేసింది లేదు. ఊరు నుంచి పీలేరుకు వెళ్లాలంటే చాలా కష్టం. 1983 నుంచి ఇక్కడే ఉన్నాం. హంద్రీనీవా కాలువ గట్టే దారి. అధికారులు ఎవరూ మాఊరికి రావడం లేదు.

- రమణయ్య, మొరవపల్లె, పీలేరు మండలం

15 మంది వీఆర్వోల డిప్యుటేషన్లు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లాలో రెండు దఫాలుగా జరిగిన వీఆర్వోల బదిలీలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో బుధవారం మరో విడత 15 మంది వీఆర్వోలను డిప్యుటేషన్లపై వివిధ మండలాలకు నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూలై 26న 45 మంది వీఆర్వోలను, అనంతరం ఆగస్టు 4న మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటిపై వివాదాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతుండగా బుధవారం మరో 15 మందిని డిప్యుటేషన్లపై బదిలీలు చేశారు. ఈ సారి జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. గతంలో బదిలీ అయిన వారిలో కొంతమందిని తిరిగి యధాతథంగా పూర్వ స్థానాలకు డిప్యుటేషన్లపై నియమించగా మరి కొంతమంది కూడా అక్కడికక్కడే సర్దుబాటు చేసే ప్రయత్నాలు చేశారు. మర్రికుంటపల్లె నుంచి గతంలో అంకిశెట్టిపల్లెకు బదిలీ అయిన సురేష్‌కుమార్‌రెడ్డిని తిరిగి మర్రికుంటపల్లెకు నియమించారు. కోళ్లబయలు నుంచి మర్రికుంటపల్లెకు గతంలో బదిలీ అయిన జి.శివశంకర్‌ను కురబలకోట మండలం ముదివేడు-1కు పంపారు. మదనపల్లె మండలం కోటావారిపల్లె నుంచి మాధవరెడ్డిని గతంలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెకు బదిలీ చేశారు. ఆయనను తాజాగా పీటీఎం మండలం టి.సదుంకు డిప్యుటేషన్‌పై నియమించారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె నుంచి ఎం.ప్రవీణ్‌కుమార్‌ను మదనపల్లె బీకే పల్లెకు నియమించారు. గతంలో ఈయనను ఇదే బీకేపల్లె నుంచి వెంగంవారిపల్లెకు బదిలీ చేశారు. ఇదే విధంగా గతంలో బదిలీ అయిన పలువురు వీఆర్వోలను తాజాగా తిరిగి వేరే మండలాల్లో నియమించారు. ఇలా డిప్యుటేషన్లపై కె.దొరస్వామి నడిమిచెర్ల (కలకడ) నుంచి ముసలికుంట (పెద్దమండెం), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రేడ్-1ను మదనపల్లె బీకే పల్లెకు, బుక్యామునిస్వామి నాయక్‌ను కోటావారిపల్లె నుంచి అమిలేపల్లె (గుర్రంకొండ), టి.భాగ్యలక్ష్మిని గుర్రంకొండ-2 నుంచి ముదివేడు-2 (కురబలకోట), గుమ్మసముద్రం (బి.కొత్తకోట) నుంచి జి.నరేంద్రబాబును కొత్తపల్లె-2 (మదనపల్లె), ముదివేడు-2 నుంచి ఎస్.ప్రతిమను గుర్రంకొండ-3, ముద్రపల్లె (పెనగలూరు) నుంచి ఎస్.స్వాతిని సి.కందులవారిపల్లె (చిట్వేలి), అక్కడున్న కె.నాగేంద్రకుమారిని ముద్రపల్లెకు, ఎ.గౌస్‌పకుర్షావలీని ముసలికుంట (పెద్దమండెం) నుంచి మట్లివారిపల్లె (కురబలకోట)కు, పెద్దకారంపల్లె (రాజంపేట) నుంచి అప్పరాజుపేటకు, నల్లతిమ్మాయపల్లె (నందలూరు) నుంచి ఎం.వి.వెంకట్రమణను పెద్దకారంపల్లెకు డిప్యుటేషన్‌పై నియమించారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

● కడప కలెక్టర్‌కు రాజంపేట నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు రాజంపేట నేతలు విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేశారు. రాజంపేట పట్టణానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన సుమారు 20 వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. సుమారు 105 సంవత్సరాలుగా సబ్‌కలెక్టర్ కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గం కేంద్రంగా, అన్నమయ్య జన్మస్థలిగా అన్ని అర్హతలున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా అతి సమీపంలోని తిరుపతి, కడప విమానాశ్రయాలు, ప్రధాన ముంబై-చెన్నై హైవేరోడ్డు, జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వనరులు రాజంపేటలో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కాశినాయన, బ్రహ్మంగారిమఠం, బద్వేల్, రాజంపేట, కోడూరుకు చెందిన 17 మండలాలు రాజంపేట డివిజన్‌లో ఉండేవన్నారు. అటువంటి డివిజన్‌లో గత జగన్ ప్రభుత్వం కుదించి ఈ ప్రాంతాన్ని గుర్తింపులేకుండా చేసి జిల్లా కేంద్రం కాకుండా చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పడిన జిల్లాలకు సంబంధించిన నూతన మంత్రివర్గ ఉపసంఘం తమ ప్రాంత మనోభావాలను గుర్తించి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జిల్లా సాధన సమితి కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ నాయకుడు ప్రభాకర్‌నాయుడు, డిగ్రీ కళాశాలల జిల్లా అసోసియేషన్ అధ్య క్షుడు గీతాంజలి రమణ, వైద్య సంఘం నాయ కుడు డాక్టర్ నవీన్, ఆర్టీసీ యూనియన్ నాయకుడు చిన్నయ్య, కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, జనసేన పార్టీ నాయకుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి



రైతులకు వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల రైతులు ఉద్యానశాఖ ద్వారా అందుబాటులో వున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతీలోని రైతులకు మామిడికాయలు కోసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ, వంటి పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు పూల మొక్కలు, కూరగాయల వంటి పంటలు వేసిన రైతులకు మల్చింగ్ పేపర్‌లను సబ్సిడీతో రూ.8వేలకే సరఫరా చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా నీటి నిల్వకుంటలకు 50 శాతం అనగా రూ.75 వేలను సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. పాలిహౌస్, షేడ్‌నెట్ హౌస్‌లను నిర్మించుకొనే వారికి 50శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. అనంతరం కలికిరి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, వాటిలో కొత్తచెట్టు నాటే రైతులు ట్రైనింగ్, ప్రూఫింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను దత్తత తీసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంవో

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రతి ఉపాధ్యాయుడు దత్తత తీసుకోవాలని అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పీవీఎన్ కుమార్ తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యాశక్తి మెటీరియల్ అందరికీ అందించారా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం అందించిన హ్యాండ్ బుక్స్ ఆధారంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎన్‌ఎంఎం పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పిల్లల హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. ఏఎంవో షమీ, ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

● పోటీలకు 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులు
● పోస్టర్ ఆవిష్కరణలో డీఈవో సుబ్రహ్మణ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలు సెప్టెంబరు 11, 12వ తేదీల్లో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఉదయం డైట్‌లో కళాఉత్సవ్-2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, కళారూపాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివరించారు. పోటీలను వ్యక్తిగత, బృంద విభాగాల్లో నిర్వహిస్తామ న్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి 94402 46825ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, కేదార్‌నాథ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్‌తో ఉల్లాసం.. ఉత్సాహం'

ఒంటిమిట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు మరణించి పిల్లలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రవిబాబు తెలిపారు. బుధవారం ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులోని నులి పురుగులు మరణిస్తాయన్నారు. దీంతో ప్రజలు తినే ఆహారం శరీరానికి బాగా పడుతుందని, పిల్లలు ఎత్తు, బరువు పెరుగుతారన్నారు. నులిపురుగులు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ భావన, రమేష్, అరుణజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది నవీన్‌కుమార్, రామ్మూర్తి నాయక్, సునీల్, లక్ష్మీనరసమ్మ, భాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎం నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి



పులివెందుల సబ్‌డివిజన్‌లో...
పోలీసుల కొరత

- గాడి తప్పుతున్న శాంతిభద్రతలు
- పెరుగుతున్న నేరాల సంఖ్య
- ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే కానిస్టేబుల్

పులివెందుల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో శాంతభద్రతలు గాడితప్పుతున్నాయి. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎప్పుడో ఏళ్లకాలం కిందట కేటాయించిన కేటాయింపుల్లోనే 60శాతానికి మించి పోలీసులు అక్కడ విధులు నిర్వహించడం లేదు. ముఖ్యంగా హెడ్‌కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక కానిస్టేబుల్ పనిచేస్తున్నారు. పులివెందుల పట్టణంలో రాత్రిళ్లు కేవలం ఒకే ఒక బీట్ ఏర్పాటు చేయడం సిబ్బంది కొరతకు నిదర్శనం. దీంతో ఇటీవల పులివెందులలో క్రైమ్‌రేట్ పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

పులివెందుల సబ్‌డివిజన్‌లో తొమ్మిది పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అందులో పులివెందులలో అర్బన్ పోలీస్‌స్టేషన్, వేంపల్లె, ఆర్కేవ్యాలీ, చక్రాయపేట, వేముల, వేంపల్లె, లింగాల, తొండూరు, సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లు సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్నాయి. వీటిలో సీఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు దాదాపు 229 మంది పనిచేయాల్సి ఉంది. కానీ 143 మంది మాత్రమే ఇక్కడ విధుల్లో ఉన్నారు. మిగిలిన 86 మందికి సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 143 మంది పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్‌లో విధులు కూడా నిర్వహించడం లేదు. వీరిలో 33 మంది బయట ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. కొందరు కోర్టు కానిస్టేబుళ్లుగా, కొందరు ఎస్‌బీ తదితర కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. దీంతో పులివెందుల సబ్‌డివిజన్ పరధిలో పోలీసుల కొరత ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది.

- తొండూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తు న్నారు. ఇక్కడ 11 మంది పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఐదుగురు మాత్రం ఇక్కడ ఉన్నట్లు లెక్క. ఆ ఐదుగురిలో నలుగురు బయట ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు ఉన్నారు. అలాగే నలుగురు హెడ్‌కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు.
- పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే 45 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉంది. అందులో 25 మంది మాత్రమే ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో పదిమంది బయట ప్రాంతాలలో పనిచేస్తున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్ల ఐదుగురికి గాను నలుగురు ఉన్నారు. ఏఎస్ఐలు నలుగురికి గాను ముగ్గురు ఉన్నారు. ఇద్దరు ఎస్ఐలు, సీఐ ఉన్నారు.
- వేంపల్లెలో ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. ముగ్గురు ఏఎస్ఐలు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. 30 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా 17 మంది మాత్రమే ఉన్నారు. అందులో 9 మంది బయటిప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.
- చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. అలాగే 19 మంది కానిస్టేబుళ్లకు గాను 11 మంది ఉన్నారు.
- వేములలో 19 మంది కానిస్టేబుళ్ల ఉండాల్సి ఉండగా 11 మంది ఉన్నారు.
- సింహాద్రిపురం మండలంలో 17 మంది కానిస్టేబుళ్లకు గాను పది మంది ఉన్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే అక్కడున్న సిబ్బందిలో ఒక ఎస్ఐ మినహా మిగిలిన సిబ్బంది ఉన్నారు. ఇలా ఎప్పుడో ప్రభుత్వం కేటాయించిన పోలీసుల సంఖ్య ఇప్పటికి కొనసాగుతోంది. ప్రస్తుతం జనాభా పెరిగిన ఆ ప్రాతిపదికన పోలీసులకు కేటాయింపులు లేకపోగా ఎప్పుడో కేటాయించిన కేటాయింపుల ప్రకారం పోలీసు సిబ్బంది లేకపోవడం శాంతిభద్రతలకు విఘతం కలిగిస్తోందని చెప్పవచ్చు. ఇటీవల పులివెందుల పట్టణంలో వరుసగా సంఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సిబ్బంది కొరత కారణంగానే శాంతిభద్రతలు గాడి తప్పుతు న్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

పులివెందులలో ఒక్క బీట్‌తోనే సరి

పులివెందుల పట్టణంలో పోలీసుల గస్తీ అనుక్షణం ఉండాలి. రాత్రి సమయంలో కనీసం మూడు నుంచి నాలుగుబీట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం ఒక బీట్‌తోనే సరిపెడుతున్నారు. దీంతో ఇటీవల ఇటీవల క్రైమ్‌రేట్ క్రమంగా పెరుగుతోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి అనడం గమనార్హం. పులివెందుల పట్టణంలో గొడవలు, హత్య, కిడ్నాప్ లాంటి వరుస సంఘటనలు చోటుచేసువడం దీనికి బలం చేకూరుస్తోంది.

మహిళ హత్యతో ఉలిక్కిపడ్డ పులివెందుల

పులివెందుల పట్టణం నడిబొడ్డున ఓ మహిళ హత్యతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే నాలుగు రోజుల క్రితం పదిరోజుల పసికందును ఓ మహిళ కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. ఇక ఇటీవల పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకోవడం, పులివెందుల పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు మట్కా, గ్యాంబ్లింగ్ తదితరవి పెట్రేగిపోతున్నా పోలీసులు అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు లేకపోలేదు.

పోలీసుల వివరాలు కడపలో తెలుసుకోండి

పులివెందుల డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత విషయమై డీఎస్పీ మురళీనాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆయన ఈ వివరాలు మా వద్ద దొరకవని.. కడప డీపీఓ ఆఫీస్‌లో దొరుకుతాయని, అక్కడ అడగండని.. ఇక్కడ శాంతిభద్రతల వ్యవహారాలే చూస్తామని సెలవిచ్చారు.

'అమ్మ మనసు' కథల సంపుటి ఆవిష్కరణ



కేతు పద్మావతి కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సృష్టికి మూలమైన అమ్మ మనసును విశిష్టమైన పంథాలో కేతు పద్మమ్మ అద్భుతంగా ఆవిష్కరించారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి కొనియాడారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సింగపూర్ సిటీలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సతీమణి కేతు పద్మావతి రాసిన అమ్మ మనసు కథల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం కుటుంబం నడుపుకోవడంతోనే మహిళల జీవితాలు గడిచిపోతున్నాయని.. అలాంటి పరిస్థితుల్లో రాయలసీమ నుంచి మహిళా కథకులు తయారు కావడం అభినందనీయమన్నారు. కేతు విశ్వనాథరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ.. ఆమె తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను కథలుగా రాయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రామమునిరెడ్డి, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు శశికాంత్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేతు పద్మావతిని సత్కరించారు.

పెనికెలపాడు చెరువుకు నీటి కోసం పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఈఈ ఉమామహేశ్వరరావు

ముద్దనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనికెలపాడు చెరువుకు గాలేరు నగిరి కాల్వ నుంచి నీటిని మళ్లించేందుకు బుధవారం జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం పెనికెలపాడు, రాజుల గురువాయపల్లె, నొస్సంవారిపల్లె, రాఘవాపురం గ్రామాల రైతులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి సాగు, తాగునీటి కోసం పెనికెలపాడు చెరువుకు నీటిని అందించాలని విన్నవించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీఎన్ఎస్ఎస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కాల్వ నుంచి గేటు సిస్టమ్ ద్వారా వంక నుంచి నీటిని చెరువుకు తరలించవచ్చని తెలిపారు. ఈ మేరకు అధికారులు స్పందించినట్లు రైతులు తెలిపారు. అలాగే వేల్పుచర్ల చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించేందుకు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ సుదర్శన్, మాజీ డీసీసీబీ చైర్మన్ కాటమయ్య, రైతులు పాల్గొన్నారు.

25 తులాల బంగారు ఆభరణాలు చోరీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం మోక్షగుండం వీధిలో వుండే ఓ బంగారు అభరణాల తయారీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే మోక్షగుండం వీధిలో మాబూషరీఫ్ బాషా అనే వ్యక్తి తన ఇద్దరి సోదరులతో కలిసి బంగారు అభరణాల తయారీ దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దుకాణం మూసి భోజనానికి వెళ్లారు. భోజనం చేసి తిరిగి మాబూషరీఫ్ అతని సోదరులు దుకాణంకు రాగానే షట్టర్ పైకి లేపి వుండటం గమనించారు. షట్టర్ తీసి దుకాణంలో వస్తువులు పరిశీలించగా దాదాపు 25 తులాల మేర బంగారు అభరణాలు అపహరణకు గురయినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు దొంగతనం జరిగిన బంగారు దుకాణం దగ్గరికి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి క్లూస్ టీంను వేలిముద్రల సేకరణ కోసం రప్పించారు. దుకాణంలో యజమానులను విచారించారు. చుట్టుపక్కల గల సీసీ కెమరాలను పరిశీలించగా.. ఓ గుర్తు తెలియని వ్యక్తి బంగారు అభరణాల దుకాణం షెట్టర్ తీసి లోపలికి వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

జమ్మలమడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచాల నవీన్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. జమ్మలమడుగులోని హరిజన కాలనీకి చెందిన నవీన్ సోమవారం రాత్రి పని నిమిత్తం స్కూటర్‌లో జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో వెళుతున్నాడు. అక్కడ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఇనుప డ్రమ్ములను వర్షానికి కనపడకపోవడంతో ఢీకొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం జమ్మలమడుగుప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరుకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని తండ్రి జమ్మలమడుగు పట్టణంలో చెప్పులు కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి పెద్ద కుమారుడు మృతితోబోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

స్థల విషయంపై పరస్పర దాడులు

- 20 మందిపై కేసు నమోదు

కాశినాయన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టిపల్లెలో బుధవారం ఓస్థల విషయమై ఎంబడి పోలయ్య, ఎంబడి సత్యరాజు అనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ పడ్డారు. దీంతో ఇరువురికి సంబంధించిన వారు రెండు వర్గాలుగా విడిపోయి పరిస్పరం దాడులకు పాల్పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం రెండు వర్గాలవారు ఒకరిపై ఒకరు నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్ఐ యోగేంద్ర పోలయ్యతో పాటు మరో ఆరుగురు, సత్యరాజ్‌తో పాటు మరో 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిపై దాడి... కేసునమోదు

కాశినాయన ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సావిశెట్టిపల్లెకు చెందిన ఎన్.విష్ణుతేజ అనే వ్యక్తిపై వినయ్ అనే యువకుడు అకారణంగా దాడిచేసి గాయపరచడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... బుధవారం విష్ణుతేజ అనే వ్యక్తి మేకలకు గడ్డికోసం డంపింగ్ యార్డు సమీపంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఇటుకులపాడుకు చెందిన రామయ్య తన ఆటోలో పూలకుండీలను గ్రామంలోకి తీసుకొచ్చాడు. ఈపూల కుండీలను ఆటో నుంచి శీను, యువ, వినయ్ అనే ముగ్గురు యువకులు దించే సమయంలో వినయ్ జారవిరచడంతో 4 కుండీలు పగిలిపోయాయి. ఆపక్కనే పొలంవద్ద ఉన్న విష్ణుతేజ అలా జారవిడస్తే రైతుకు నష్టం కాదా అన్నాడు. దీంతో ఆగ్రహించిన వినయ్ అతనిపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు విష్ణుతేజ ఫిర్యాదు మేరకు వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘర్షణ - ఇద్దరికి గాయాలు

చాపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు... సోమాపురం గ్రామం వద్ద కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. ఈరోడ్డుకు ఇరువైపుల భూములకు కాలువలు ఏర్పాటు చేయాలని కొంతమంది రైతులు కోరగా.. మరికొందరు వద్దని చెబుతున్నారు. ఈ నేపద్యంలో పైపులైను ఏర్పాటు చేసే నాలుగు సెంట్ల భూమి విషయమై ఇరువర్గాలు కట్టెలతో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. దాడిలో భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి అనే ఇద్దరు వ్యక్తుల తల, చేతులకు గాయాలయ్యాయి. పైపులైను ఏర్పాటు చేయాలని ఈనెల 18న కలెక్టర్‌కు గ్రీవెన్‌సెల్‌లో వారు వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దారు రమాకుమారి సాయంత్రం 5 గంటల సమయంలో అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వారు గొడవపడ్డారు. గాయపడిన వారిని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- ఎస్‌సీ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



కడప రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. రైల్వే సిబ్బందికి సమయపాలన తప్పనిసరి అని స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి పర్యటనలో భాగంగా ఆయన కడప రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి.. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా సహించేది లేదని, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు, కడప సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రైల్వే కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కడప బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని 2వ ప్లాట్‌ఫాం నుంచి రైల్వేకాలనీ వరకు విస్తరించాలని కోరారు. కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ప్రధానంగా టీటీఈ గది కార్యాలయం పీడబ్ల్యూఐ కార్యాలయం కూడా అక్కడే ఉన్నాయని చెప్పారు. సిబ్బంది రైలు పట్టాలు దాటాల్సి రావడం వల్ల ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కాలనీ వరకు విస్తరిస్తే రైల్వే కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. రైల్వే క్వార్టర్స్ నిర్మించాలని, మరికొన్ని సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ కడప బ్రాంచ్ సెక్రటరీ ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయస్వామి దేవస్థానానికి రూ.50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి

రాజుపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పదవీ విరమణ పొందిన ఐపీఎస్ అధికారి రవీంద్రబాబు రూ.50వేలు విరాళం అందజేశారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా సంజీయరాయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి శేష వస్త్రాలు, మెమోంటోలు రవీంద్రబాబుకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ పీజీలో 975వ ర్యాంకు



సీకేదిన్నె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుసిరెడ్డిపల్లెకు చెందిన గజ్జెల శ్రావణి మెడికల్ పీజీ ఎంట్రెన్స్‌లో 975వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌పూర్తి చేసిందన్నారు. పీజీ ఎంట్రెన్స్ రాయగా జాతీయస్థాయిలో 975వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. తండ్రి ఆంజనేయరెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌గా 11వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు.

దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు అవకాశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అనర్హులుగా నోటీసు అందుకున్న వారు వికలత్వ పింఛన్లకు తాము అర్హులమని భావిస్తే తమకు సమీపంలోని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరును సంప్రదించి అర్జీలు సమర్పించవచ్చన్నారు. ఆ అర్జీని పరిశీలించి వికలత్వం పింఛను పరిశీలనకు పరిశీలిస్తారన్నారు. వికలత్వ పునఃపరిశీలన చేసేందుకు షెడ్యూలు ప్రకారం అర్జీదారులకు కేటాయించిన తేదీల్లో నిర్దేశించిన ఆసుపత్రిలో హాజరు కావాలని కోరుతూ తదుపరి నోటీసు జారీ చేస్తారన్నారు. వివరాలకు సమీపంలోని గ్రామవార్డు సచివాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

26న ఐటీఐ అడ్మిషన్లకు గడువు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయడానికి ఈ నెల 26న గడువు ఉందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ అసిస్టెంటు డైరెక్టరు రత్నరాజు ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషనిస్ట్, మోటరు మెకానిక్, డీజలు మెకానిక్, వెల్డర్ కార్పెంటరు తదితరాలకు ఖాళీగా ఉన్న సీట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు పాస్‌పోర్టు సైజు గల ఫొటో, తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు విద్యార్థి ఆధార్‌కార్డు కూడా తీసుకుని నేరుగా ఐటీఐ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌కు హాజరయ్యారు. ఇటీవల పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో పాటు ధర్నా నిర్వహించారు. దీనిపై ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో డాక్టర్ సుధీర్‌రెడ్డి, మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన్ను అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వాయిదా నిమిత్తం ఆయన బుధవారం ఎస్ఐ వద్ద హాజరయ్యారు. ఈ కేసును మళ్లీ 25వ తేదీకి వాయిదా వేస్తూ పోలీసులు నోటీసులు ఇచ్చారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు యత్నాలు




టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా.. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో రాష్ట్రమంతటా టిడ్కో ఇల్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో కొర్రపాడు రోడ్డులో నిర్మించి మధ్యలో ఆపేసిన టిడ్కో గృహాలను కమిషనర్ రవిచంద్రారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రమోహన్‌తో బుధవారం కలిసి పరిశీలించారు. దాదాపు మూడు బ్లాకులలో 144 ప్లాట్లకు స్లాబులు పూర్తయిన దశలో ఉన్నాయని గుర్తించారు. వీటికి అవసరమైన మౌలిక సదపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లపై కమిషనర్ సమీక్షించారు. త్వరలో అక్కడ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తపాల బిల్లుల సేకరణ (ఫిలటరీ) అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాల్ స్పర్శ్ యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతియేటా చదువులో మంచి ప్రతిభ కనపరుస్తూనే ఫిలటరీని అభివృద్ధిగా కొనసాగించే 6, 7 , 8, 9వ తరగతి విద్యార్థులకు సర్కిల్‌స్థాయిలో ఫిలటరీ ప్రాజెక్టు స్పీచ్, పరీక్షల ఆధారంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్న విషయం ప్రజలకు విదితమే. ఇందులో భాగంగానే 2025-26 సంవత్సరానికి గాను దీన్ దయాల్ స్పర్శ్‌యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకం నోటిఫికేషన్‌ను భారత తపాలా శాఖ విడుదల చేసిందన్నారు. పరీక్షలలో అర్హత సాధించి ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6 వేలు ఇస్తామని తెలిపారు. ఈనగదును విద్యార్థి తల్లిదండ్రుల ఉమ్మడి ఐపీపీబీ పోస్టల్ ఖాతాలో జమ చేస్తారని, విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విజయవాడ పోస్టు.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను వీక్షించవచ్చని, లేదా దగ్గరలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.



CHANGE OF SURNAME

I, HIMABINDU DAGGUPATI (Old name), R/o. # 4/11, Rampavaripalli, Ananthaiahgari palli, Pullampet Mandal, Annamayya District, A.P., hearby changed my Surname as NAGOTHU HIMABINDU (New name), W/o NAGOTHU MALLIKARJUNA. For all purposes.
AJC-000

CHANGE OF SURNAME

I, POTTAPI VIGNESH REDDY (Old name), residing at Venkatarajupalli, Nagiripadu Post, Chitvel Mandal, Annamayya District, A.P., hearby changed my Surname as POTHAPI VIGNESH REDDY (New name), S/o POTHAPI PREMA CHANDRAREDDY. For all purposes.
AJC-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 237946

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రజల సమస్యలను వెంటనే పరిశీలించాలి

వీరబల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చే యాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి రాజం పేట సబ్ కలెక్టర్ భావన సూచించారు. బుధవారం ఆమె వీరబల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ఇంత వరకు రైతు భరోసా అందని రైతుల సమస్యలపై దృష్టి సారిం చాలన్నారు. ఫ్రీహోల్డ్ భూములకు ఇంతవరకు పడలేదని, దానిని ఏ విధంగా సరి చేసుకోవాలో రైతులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోకు సన్మానం


డిప్యూటీ డీఈవో నాగయ్యను సత్కరిస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖాధికారిగా ఉంటూ ఇటీవల రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన లంకాయగారి నాగయ్యను బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్‌కు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఉప విద్యాశాధికారిగా పాఠశాల విద్యాశాఖకు గొప్ప పేరు వచ్చేలా చేసి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించేలా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఎంఈవో-2 అనంతకృష్ణ, ఉపాధ్యాయులు గ్లోరికిరణ్ ఉజాల, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకట సుబ్బయ్య, శిల్పి ఆనందాచారి, గీతా, జ్యోతిప్రియ, ఆర్‌వీ రమణ మ్మ, పి.విజయ్‌కుమారి, గౌరి, మస్తాన్, గాయత్రిదేవి, పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో వెల్లలూరు వాండ్లపల్లె వాస్తవ్యులు పునర్విక రెండవ పుట్టినరోజు సందర్భంగా తండ్రి గుగ్గిళ్ల వెంకటమల్లేశ్, తల్లి గుగ్గిళ్ల శ్రావణి దంపతుల సహకారంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం చేసినట్లు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం దాతలు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో అన్నదానం చేసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Deshmuk Rahamathulla Khan S/o. D.Mokarab Khan, R/o. Door No. 63/66, Budansab Street, Rayachoty Town, Post, Mandal, Annamayya District** under equitable mortgage by way of deposit of title deeds In respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property.

SCHEDULE OF PROPERTY

Annamayya District erstwhile Y.S.R. Kadapa District, Rayachoty Sub. Reg.Dist, Rayachoty Mandal at Masapata Village fields in Sy.No. **190/4, 191/6** an extent of 60 square yards out of Ac. 0-12 cents out of Ac. 4-40 cents vacant house site

Bounded by : East - Rice mill of Shaik Kareemulla, **West -** 20 feets width Rasta,North - Shaik Naseeb Jan, South - Site of Chindaluru Prasad

Measuring: East -West (Length) = 45 feets; North - South (width) = 12 feets.

(Property covered under registered sale deed No. **1885/ 2023** (S.R.O. Rayachoty)

C. Sunil Kumar Reddy, B.A.,B.L.,
Advocate, Rayachoty, Cell No. 9441738746.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY branch I issue the following notice. My client company intends to grant a loan facility to **Smt Kunchapu Kalavathi W/o. Kunchapu Gangaraju, Sri Kunchapu Lakshmaiah S/o. Kunchapu Gangaraju, R/o. Door No. 63/66, Budansab Street, Rayachoty Town, Post, Mandal, Annamayya District** under equitable mortgage by way of deposit of title deeds In respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property.

SCHEDULE OF PROPERTY

Annamayya District erstwhile Y.S.R. Kadapa District, Rayachoty Sub. Reg.Dist, Rayachoty Mandal at Rayachoty Village fields in Sy.No. **642** an extent of 66.66 square yards vacant site with Plot No.22 out of Ac.3-66 cents

Bounded by : East - Site of Katika People, **West -** 14 feets width Rasta, North - Site in plot No. 23 of Sibyala Nageswari, South - Site in Plot No. 21 **Measuring:** East -West (Length) = 50 feets; North - South (width) = 12 feets.

(Property covered under registered sale deed No. **16/2017** (S.R.O. Rayachoty)

C. Sunil Kumar Reddy, B.A.,B.L.,
Advocate, Rayachoty, Cell No. 9441738746.

ఉత్సవాలకు గణనాథులు సిద్ధం!

- ఊపందుకున్న ప్రతిమల విక్రయాలు
- నిమజ్జనానికి వాతావరణం అనుకూలం

సుండుపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా వినాయక మండపాల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ మండపాల్లో ప్రతిష్ఠించేందుకు అవసరమైన విగ్రహాల తయారీలో కార్మికులు నిమగ్నమయ్యారు. 2 అడుగుల నుంచి 14 అడుగుల ఎత్తున్న విగ్రహాలను బూడిదేటిపల్లె, పెదినేనికాలువతో పాటు సుండుపల్లె మండల కేంద్రంలో తయారు చేస్తూ సరసమైన ధరలకే భక్తులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేశ ప్రతిమలు

మండపాల ఏర్పాటు పనులు ముమ్మరం

వ్యాపారులు ప్రతిమలను సిద్ధం చేయగా , చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు యువకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు విగ్రహాలు కొనుగోలు చేశారు. భక్తులతో పాటు విగ్రహాలను తయారు చేసే కార్మికులు దాదాపుగా వినాయకుని ప్రతిమలను సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. రంగురంగుల విగ్రహాలను సిద్ధం చేశారు. గత ఏడాది సుండుపల్లెలోని కొన్ని మండపాల నిర్వహణకు రూ.4 లక్షల నుండి రూ.5 లక్షల వరకు ఖర్చు కాగా, ఈ ఏడాది అంతకుమించి ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.


వినాయకుడి ప్రతిమలను తీర్చిదిద్దుతున్న కార్మికుడు

నిమజ్జనానికి అనుకూలం

ఈ ఏడాది వరుణదేవుడు కరుణ చూపడంతో.. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, నదుల్లో వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ సారి నిమజ్జనానికి ఇబ్బందులు తప్పినట్లేనని భక్తులు చెబుతున్నారు.

ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు



ప్రతి ఏడాది వినాయక చవితి ఉత్సవలను కార్తికేయనగర్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం యువకులు సైతం ఉత్సవాల నిర్వహణకు సిద్ధంగా ఉన్నారు. ఈ సారి భారీగా అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే విగ్రహాన్ని కొనుగోలు చేశాము.

- మద్దికారి జయరాం, కార్తికేయ నగర్ ఉత్సవ కమిటీ సభ్యుడు

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య ఆరోగ్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య తెలిపారు. ప్రపంచ దోమల దినం సందర్భంగా లక్కిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. కీటక జనిత వ్యాధులపైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఫ్రైడేని తప్పని సరిగా డ్రైడే చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో నిలువవున్న నీటిని తొలగించి అందులో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో దేవదానం, సూపర్‌వైజర్ మనీ, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం: ప్రస్తుత సీజన్‌లో దోమల కాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని లక్కిరెడ్డిపల్లె సబ్ యూనిట్ అధికారి రామయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రేఖా నాయక్ తెలిపారు. మండలంలోని గువ్వల చెరువు గువ్వలచెరువు ఎంపీపీ పాఠశాలలో బుధవారం సబ్ యూనిట్ అధికారి జీ. జయ రామయ్య, బీ. రేఖానాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో దోమల నివారణ, ర్యాలీ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఓబులేసు, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రమీలమ్మ, ఇంద్రజా, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

నందలూరు : మండలంలో డాక్టర్ శరత్‌కమల్ ఆధ్వర్యంలో ర్యాలీ, కళాశాలలో ఇంటర్మీడియట్ పిల్లలకు సమావేశం ఏర్పాటు చేసి దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, సబ్‌యూనిట్ అధికారి ఎస్.ఎస్.దాస్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం : పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సీహెచ్‌వో లక్ష్మీ నరసింహ, సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసి స్టెంట్ వెంకటసుబ్బయ్య వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె :మండల కేంద్రంలో వైద్య సిబ్బంది విద్యార్థులతో ర్యాలీ చేయించి అవగాహన కల్పించారు.

సుండుపల్లె : రాయవరం ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలో డాక్టర్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో వీరనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అర్హులందరికీ పింఛన్ అందుతుంది

- ఎంపీడీవో రామచంద్ర


ఎంపీడీవోకు దరఖాస్తులు అందజేస్తున్న దివ్యాంగులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నోటీసులందుకున్న దివ్యాంగులు అధైర్య పడాల్సిన పనిలేదని అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ వస్తుందని ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో నోటీసులు అందిన దివ్యాంగుల నుంచి వినతి పత్రాలను స్వీకరిం చారు. వీరి వివరాలను వాట్సాప్ ద్వారా పైస్థాయి అధికారులకు పంపుతామన్నారు. అధికారులు వీరందరికీ రీటెస్ట్ నిర్వహించి అర్హులైన వారందరినీ గుర్తిస్తారని తెలియజేశారు. మండలంలో సుమారు 30 మందికి పైగా నోటీసులు అందినట్లు తెలిపారు. వారికి సంబంధించిన సదరం సర్టిఫికెట్లతో దరఖాస్తు అందించామని, అర్హులైన వారికి అన్యాయం జరగదని తెలియజేశారు.

రామాపురం: పింఛన్లు రద్దయిన పలువురు దివ్యాంగులు మళ్లీ దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. వారిని వెరిఫి కేషన్ కోసం ఆసుపత్రులకు పంపుతున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులందరూ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించు కోవాల్సి ఉంటుందని వివరించారు.

రేపు చిట్వేలిలో విద్యుత్ అదాలత్

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22న చిట్వేలిలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు రాజంపేట విద్యుత్‌శాఖ ఈఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ఈ అదాలత్ ఉంటుందన్నారు. విశ్రాంత జడ్జి వి.శ్రీనివాసు ఆంజనేయమూర్తి, చైర్‌పర్సన్‌గా బి.మధుకుమార్ విజయలక్ష్మి, సభ్యులుగా పాల్గొంటారని తెలిపారు. చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరువాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ద్విచక్ర వాహనాల తనిఖీ

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాకరాపేట చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం ఒంటిమిట్ట సీఐ బాబు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులకు ఒక్కో వాహనానికి రూ.185 చొప్పున 10 ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పంటలపై అవగాహన అవసరం

రాజంపేట టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏ కాలంలో, ఏ పొలంలో ఎలాంటి పైరు సాగు చేయాలన్న అంశాలపై రైతులకు అవగాహన అవసరమని ఏవో నాగలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె హస్తవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలపైన అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆటో డ్రైవర్ల ధర్నా


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు, సీపీఐ నాయకులు

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు తమ సంక్షేమం కోసం ఎన్నో హా మీలు ఇచ్చిన కూటమి నాయకులు వాటిని అమలు చేయడం లేదన్నారు. ఇకనైనా ప్రమాదబీమా రూ.10 లక్షలు అమలు చేయాలని, వాహనమిత్ర కింద రూ.15 వేలు ఇవ్వాలని, కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, వాహనాల కొనుగోలు కు ప్రత్యేక రుణం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సబ్‌కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మహేష్, గంగాధర్, చంద్ర, సికిందర్, శివరామకృష్ణ దేవర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 శాఖరాజుపల్లె సర్వేనంబరు 425/2లోని 4 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని మంగళ వారం రాత్రి కొంతమంది చదును చేశారు. ఈ విషయమై స్థానిక తహసీ ల్దారు ఆకుల తిరుమలబాబును ప్రశ్నించగా ఆ స్థలం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌కు సంబంధించినదని, ఆలయ నిర్మాణం పేరుతో కొంతమంది ఆ స్థలాన్ని చదును చేసినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు.

శక్తి యాప్ ప్రయోజనాలపై అవగాహన అవసరం

- మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య


శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శంకరమల్లయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా భయపడకుండా ఎదుర్కొనేలా సిద్ధం కావాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జీ.శంకరమల్లయ్య బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళ ల భద్రతకు సంబంధించిన చట్టాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. శక్తియాప్ ప్రయోజనాలు, శక్తి టీం పనిచేసే విధానం వివరించారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు మహిళలు తమను తాము రక్షించుకునేందుకు ఉపయోగపడే టోల్ ఫ్రీ నెంబర్లను తెలియ జేశారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏ ఆపదలోనైనా 112 కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 నెంబర్ తెలియజేయాలన్నారు. ఉమన్ హెల్ప్ లైన్, బాల్యవివాహాలు మొదలగు వాటికి 181 డయల్ చేయాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల రక్షణ, భద్రత కోసం 1098 నెంబర్‌కు తెలపాలన్నారు. డ్రగ్స్‌టోల్ ఫ్రీ నెంబర్ 1972 మొదలగు వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, రాయచోటి సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది సాగర్‌రెడ్డి, సురేఖ, పీరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం నేరమని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేశ్ వివరించారు. సిద్దవటంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు స్కానింగ్ చేసిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు అందించాలి తప్ప పుట్టబోయే బిడ్డ లింగ నిర్ధారణ వివరాలు తెలపకూడదని సూచించారు. వైద్య సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తించరాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నగేష్, డాక్టర్ ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్

గాలివీడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ గృహ నిర్మాణ శాఖ , ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏఈ రమేశ్‌నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌తో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆర్ఎల్, ఆర్‌సీ స్థితిలో ఉన్న లబ్ధిదారులతో సమా వేశం నిర్వహించి త్వరితగతిన ఈ పనులను పూర్తి చేయించాలని ఆదే శించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని తెలి పారు. ఇందులో హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, హౌసింగ్ లబ్దిదారులు పాల్గొన్నారు.

చక్రంపేట హైస్కూల్‌కు వాటర్ ప్యూరిఫయర్ విరాళం


తాగునీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సావిత్రమ్మ

పెనగలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బుధవారం తాగునీటి శుద్ధి యంత్రాన్ని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సావిత్రమ్మ దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పుచ్చకాయల వెంకటరమణ, పి.శివయ్య గోపవరం సుబ్బ నరసయ్య, కట్టా వెంకటేశ్వరావు, పాలూరు సుధాకర్ నాయుడు, పంచాయతి కార్యదర్శి పెంచలయ్య, గ్రామ పెద్దలు కుమార్, చాగల వెంకటేశ్, వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్ర ఆలయ ప్రథమ వార్షికోత్సవం

చిట్వేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని గుడ్లవారిపల్లె వద్ద ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షిక కుంభాభిషేకం సందర్భంగా గురువారం ఉదయం గణపతిపూజ స్వస్తివాచనం, గోపూజ , ఉదయం స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి అన్న ప్రసాద వితరణ కార్యక్రమంతో పాటు, రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను హరికథా కాలక్షేపం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు తెలియజేశారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందగలరని కోరారు.

లక్ష్మీగారిపల్లెలో రైతు క్షేత్ర పాఠశాల


విత్తనశుద్ధి విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట పంచాయతీ పరిదిలోని లక్ష్మీగారిపల్లెలో ఆత్మ సహకారంతో వ్యవ సాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు విత్తనశుద్ధి, నానో ఎరువుల ఉపయోగాలను ఏ డీఏ మణి, అధికారి సం దీప్ వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు డివిజన్ బ్లాక్ టెక్నాలజి మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, వీహెచ్‌ఏ ఉదయభాను, రైతులు తది తరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం 'మానవత' ర్యాలీ

రైల్వేకోడూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం రైల్వేకోడూరులో బుధ వారం మానవత స్వ చ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో ర్యాలీ నిర్వహించా రు. సంస్థ చైర్మన్ కే. ప్రసాద్‌వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రపంచ శాంతిని కోరుకోవాలన్నారు. అప్పుడే యుద్ధమేఘాలు అలుముకోవని తెలిపారు. యుద్ధం కారణంగా ఏర్పడే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ కో-చైర్మన్ టి. వెంకట రమణయ్యయాదవ్, కార్యదర్శి ఆర్. చంగల్‌రెడ్డి, డైరెక్టర్స్ కే. బాలకృష్ణ, ఏపీజీపీ మేనేజర్ వాసు, చంద్రమోహన్‌రాజు, కోశాధి కారి పి. నిరంజన్, సభ్యులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీనివాసులు జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను కలిసి మానవత సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, మానవత సంసథ సభ్యులు హరికుమార్, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, రవీంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శికి పితృవియోగం

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు తండ్రి అబ్బవరం వెంకట్రమణ అనారోగ్యం కారణంగా బుధవారం మరణించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు వెంకట్రమణ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు సీ. వెంకటేశ్వర్లు, రాం మోహన్, దస్తగిరిరెడ్డి, హరిశర్మ, భాగ్యమ్మ, రామచంద్ర, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, మెహరాజ్, హరిప్రసాద్, జాబీర్ తదితరులు నివాళులర్పించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం


భోజనం ప్యాకెట్ అందిస్తున్న నాగేంద్ర

రైల్వేకోడూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు బుధవారం భోళాశంకర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మందల నాగేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిండి లేని నిరుపేదలను గుర్తించి అన్నదానం చేస్తున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో బెడ్ పై ఉన్న రోగులకు సకాలంలో భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు వాసా బాబు, వి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

రాయచోటి నేతాజీ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా కమిటీ సభ్యులు బాధ్యతవహించాలని తెలియజేశారు. మండపాల వద్ద భక్తి పాటలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. నిమజ్జనం తేదీలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతి యుతంగా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన ఉత్సవ నిర్వాహకులకు సూచించారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

రాజంపేట - A.C.O.: 99854 11312 | రాయచోటి - A.C.O. : 63006 38887 | రాయచోటి - S.R.: 99858 65573 | రైల్వేకోడూరు - S.R.: 98854 12462 | D.C.M. : 99854 11184

ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి

● మెట్టసోంపల్లెలో విషాదఛాయలు


ఆవుల శంకర (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఓ గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి మృతిచెందిన విషాదకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. దేవప్పకోట పంచాయతీ మెట్ట సోంపల్లెకు చెందిన ఆవుల రామప్ప కుమారుడు ఆవుల శంకర (55) సోమవారం గొర్రెలను మేపుకునేందుకు మెట్టసోంపల్లె గ్రామ శివారులో ఉన్న ఏటి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి ఏటిలో పడిపోయాడు. పక్కనే గొర్రెలను మేపుకుంటున్న మహిళలు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. హుటాహుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అక్కడికి చేరుకుని పీటీఎం పోలీసులకు తెలియజేశారు. ఎస్‌ఐ హరిహరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో ఏటిలో గాలించారు. సాయంత్రం 7గంటలకు బయటకు వెలికితీయగా, శంకర అప్పటికే మృతిచెందాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తన స్వగ్రామమైన మెట్టసోంపల్లెకు తరలించారు. శంకర మృతితో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు మల్లిఖార్జున ఉన్నారు.

రెండురోజుల జాతీయస్థాయి శిక్షణ


సర్టిఫికెట్ అందుకుంటున్న శివనారాయణగౌడ్

చిట్వేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) వారు జిగ్యాస కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 30 మంది ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.శివనారాయణగౌడ్ బెంగుళూరులోని జాతీయ వైమానిక అంతరిక్ష ప్రయోగశాలలో ఏరోడైనమిక్స్, విమాన విడిభాగాలు, నానో మెటీరియల్స్ పైన 2 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సంస్థ డైరెక్టర్ జిగ్యాస మోడల్ అధికారి డాక్టర్ వీపీఎస్ నాయుడు ద్వారా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, ఉపాధ్యాయ సిబ్బంది శివనారాయణగౌడ్‌ను అభినందించారు.

లేగ దూడల సంరక్షణపై శ్రద్ధ చూపాలి

● డీఏహెచ్ఓ గుణశేఖర్


దూడల ప్రదర్శనలో గుణశేఖర్, పాడిరైతులు

కలకడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): లేగ దూడల సంరక్షణపై పాడి రైతులు శ్రద్ధ చూపాలని డీఏహెచ్‌వో గుణశేఖర్ అన్నారు. మండలంలోని నడిమిచెర్లలో బుధవారం నిర్వహించిన మేలుజాతి దూడల ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ పశుపోషణను ఎంచుకొని జీవనాధారం సాగించే రైతులు నికరాదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ పథకాలైన పశుబీమా, లింగ నిర్ధారణ వీర్యం, పశుగ్రాస విత్తనాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ ఆవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు వచ్చిన 52 లేగ దూడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎంపికైన దూడల యాజమానులు నాగేంద్రరెడ్డి, నిరంజన్, రెడ్డిశేఖర్‌రెడ్డిలకు బహుమతులు అందజేశారు. పశుపోషకులకు మినరల్ మిక్చర్, మందులను పంపిణీ చేశారు. అధికారులు సుబ్బారావు, శశికళ, పూర్ణిమ, తేజకల్యాణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

రాయచోటి (నేతాజీసర్కిల్), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ చేయకుండా, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ తాత్కాలికంగా తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ కార్యదర్శి పి.ఓబులమ్మ, గాలివీడు మండలం నూలివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, వీరబల్లి మండలం ఓదివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రహిమాన్, చిన్నమండెం పడమటికోన గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.జమీర్‌హుసేన్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

హత్యకేసులో ఇద్దరు నిందితులు అదుపులోకి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సీటీఎం గ్రామం, రైల్వేస్టేషన్ సమీపంలో బ్రిడ్జి వద్ద అనుమానాస్పద కేసులో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఖదీర్ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా కదిరి రైల్వే పోలీసులు ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసి హత్య చేసిన నిందితులను ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకొన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిని కదిరి రైల్వే పోలీసుస్టేసన్ తరలించినట్లు తెలిసింది.

80 ఏళ్లుగా మట్టిరోడ్డే గతి

● పట్టించుకోని పాలకులు
● వర్షం వస్తే నరకమే..
● ఇబ్బందుల్లో వృద్ధులు, విద్యార్థులు
● ఎన్నికల హామీలు ఏమయ్యాయి ?


మొరవపల్లెకు వెళ్లే హంద్రీనీవా కాలువగట్టు రహదారి

పీలేరురూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జరుపుకున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్లు వ్యయం చేస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా మీఊరి రోడ్డు వేయిస్తామని లెక్కలేనన్ని సార్లు హామీలు గుప్పించారు తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో నేటికీ పలు గ్రామాలు రహదారి వసతికి నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా తమ గతి ఇంతేనంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం వస్తే ఎంత అత్యవసరమైనా ఊరు నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాలంటే గగనమే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ నాలుగు గ్రామాలు నేటికీ రహదారి వసతికి నోచుకోకపోవడం శోచనీయం. నిత్యం రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సమస్యల సంద్రంలో బతుకు బండి లాక్కొస్తున్నారు.

పీలేరు మండలం జాండ్ల పంచాయతీ పరిధిలోని గుట్టకిందల్లె, ఎస్టీ కాలనీ, గుట్టకిందపల్లె, హరిజనవాడలో సుమారు 120 కుటుంబాలు జీవిస్తున్నారు. పీలేరు-తలపుల రహదారి మార్గం లోని బసిరెడ్డిగారిపల్లె క్రాస్ నుంచి ఎస్టీ కాలనీ మీదుగా హరిజనవాడకు నాలుగు కి.మీ. మట్టిరోడ్డు ఉంది. అలాగే బాలంవారిపల్లె పంచాయతీ పరిధి లోని నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లె మీదుగా అక్కిసేనువారిపల్లె, చిచ్చిలవారిపల్లె వరకు 4 కి.మీ. మట్టిరోడ్డే గతి. ఇరు పంచాయతీల్లో రహదారి వేయాలని ఐదేళ్లకోసారి ఓట్ల కోసం వచ్చే ప్రముఖ రాజకీయ పార్టీ నేతల దృష్టికి తేవడం, అధికారంలోకి వచ్చిన వెంటనే అటకెక్కడం పరిపాటిగా మారింది. నాలేవాండ్లపల్లె కాలనీ నుంచి మొరవపల్లెకు రెండు కి.మీ. హంద్రీనీవా కాలువ గట్టుపైనే వెళ్లాల్సిన దుస్థితి. ఇక్కడ 45 కుటుంబాలు నివసిస్తున్నారు. రాత్రి వేళల్లో వెళ్లాలంటే బిక్కుబిక్కు మంటూ ప్రణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే. వర్షం వస్తే ఈ గ్రామాల ప్రజలు పడే ఇక్కట్లు వర్ణనాతీతం. దారి పొడవునా బురద, గుంతల మయై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. కనీసం ఆటో రమన్నా వచ్చే పరిస్థితి లేదు. నిత్యం ఈ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు నడుచుకొని రావాల్సిందే. ఇక రైతులు, వృద్ధులు, మహిళల, రోగుల పరిస్థితి చెప్పనక్కరలేదు. దశాబ్దాలు గడుస్తున్నా రహదారి వసతికి నోచుకోకపోవడం శోచనీయం.


గులకరాళ్లు, గుంతలమయమైన గుట్టకిందపల్లె రహదారి

ఆటో వెళితే నాలుగు పంక్చర్లు



పీలేరు నుంచి గుట్టకిందపల్లెకు ఒక్కసారి వెళ్లొస్తే ఆటోకు నాలుగు పంక్చర్లు వేయాలి. ఇచ్చే బాడుగ కన్నా పంక్చర్లకు అయ్యే ఖర్చే ఎక్కువ. దారి పొడవునా గులకరాళ్లు, గుంతలమయం. పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన దాఖలాలు లేవు. ఇక ఎంతకాలం ఈ ఇక్కట్లు.

- బి.నాగరత్నంనాయక్, ఎస్టీ కాలనీ, పీలేరు మండలం

రెండు కిలోమీటర్లు నడవాలి



మా బిడ్డలు బడికి వెళ్లాలంటే రెండు కి.మీ. నడిచి వెళ్లాలి. రోడ్డు వేయనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఓట్ల కోసం వచ్చే నాయకులు అదిగో ఇదిగో అంటున్నారు తప్ప రోడ్డు వేసిన పాపాన పోలేదు. ఎన్నో ఏళ్ల నుంచి అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అంతా కూలీ నాలి చేసుకొని బతుకుతున్నాం. ఎప్పుడేస్తారో ఏమో.

- సుప్రియ, మొరవపల్లె, పీలేరు మండలం

ఎవరూ పట్టించుకోవడం లేదు



రోడ్డు వేయాలని చాలా ఏళ్లుగా అడుగుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికలు అయిన వెంటనే వేయిస్తాం అంటున్నారు తప్ప వేసింది లేదు. ఊరు నుంచి పీలేరుకు వెళ్లాలంటే చాలా కష్టం. 1983 నుంచి ఇక్కడే ఉన్నాం. హంద్రీనీవా కాలువ గట్టే దారి. అధికారులు ఎవరూ మాఊరికి రావడం లేదు.

- రమణయ్య, మొరవపల్లె, పీలేరు మండలం

15 మంది వీఆర్వోల డిప్యుటేషన్లు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లాలో రెండు దఫాలుగా జరిగిన వీఆర్వోల బదిలీలు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో బుధవారం మరో విడత 15 మంది వీఆర్వోలను డిప్యుటేషన్లపై వివిధ మండలాలకు నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జూలై 26న 45 మంది వీఆర్వోలను, అనంతరం ఆగస్టు 4న మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటిపై వివాదాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతుండగా బుధవారం మరో 15 మందిని డిప్యుటేషన్లపై బదిలీలు చేశారు. ఈ సారి జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన రావు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. గతంలో బదిలీ అయిన వారిలో కొంతమందిని తిరిగి యధాతథంగా పూర్వ స్థానాలకు డిప్యుటేషన్లపై నియమించగా మరి కొంతమంది కూడా అక్కడికక్కడే సర్దుబాటు చేసే ప్రయత్నాలు చేశారు. మర్రికుంటపల్లె నుంచి గతంలో అంకిశెట్టిపల్లెకు బదిలీ అయిన సురేష్‌కుమార్‌రెడ్డిని తిరిగి మర్రికుంటపల్లెకు నియమించారు. కోళ్లబయలు నుంచి మర్రికుంటపల్లెకు గతంలో బదిలీ అయిన జి.శివశంకర్‌ను కురబలకోట మండలం ముదివేడు-1కు పంపారు. మదనపల్లె మండలం కోటావారిపల్లె నుంచి మాధవరెడ్డిని గతంలో వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లెకు బదిలీ చేశారు. ఆయనను తాజాగా పీటీఎం మండలం టి.సదుంకు డిప్యుటేషన్‌పై నియమించారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె నుంచి ఎం.ప్రవీణ్‌కుమార్‌ను మదనపల్లె బీకే పల్లెకు నియమించారు. గతంలో ఈయనను ఇదే బీకేపల్లె నుంచి వెంగంవారిపల్లెకు బదిలీ చేశారు. ఇదే విధంగా గతంలో బదిలీ అయిన పలువురు వీఆర్వోలను తాజాగా తిరిగి వేరే మండలాల్లో నియమించారు. ఇలా డిప్యుటేషన్లపై కె.దొరస్వామి నడిమిచెర్ల (కలకడ) నుంచి ముసలికుంట (పెద్దమండెం), ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రేడ్-1ను మదనపల్లె బీకే పల్లెకు, బుక్యామునిస్వామి నాయక్‌ను కోటావారిపల్లె నుంచి అమిలేపల్లె (గుర్రంకొండ), టి.భాగ్యలక్ష్మిని గుర్రంకొండ-2 నుంచి ముదివేడు-2 (కురబలకోట), గుమ్మసముద్రం (బి.కొత్తకోట) నుంచి జి.నరేంద్రబాబును కొత్తపల్లె-2 (మదనపల్లె), ముదివేడు-2 నుంచి ఎస్.ప్రతిమను గుర్రంకొండ-3, ముద్రపల్లె (పెనగలూరు) నుంచి ఎస్.స్వాతిని సి.కందులవారిపల్లె (చిట్వేలి), అక్కడున్న కె.నాగేంద్రకుమారిని ముద్రపల్లెకు, ఎ.గౌస్‌ఫకుర్వాల్లీని ముసలికుంట (పెద్దమండెం) నుంచి మట్లివారిపల్లె (కురబలకోట)కు, పెద్దకారంపల్లె (రాజంపేట) నుంచి అప్పరాజుపేటకు, నల్లతిమ్మాయపల్లె (నందలూరు) నుంచి ఎం.వి.వెంకట్రమణను పెద్దకారంపల్లెకు డిప్యుటేషన్‌పై నియమించారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

● కడప కలెక్టర్‌కు రాజంపేట నేతల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు రాజంపేట నేతలు విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేశారు. రాజంపేట పట్టణానికి చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన సుమారు 20 వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. సుమారు 105 సంవత్సరాలుగా సబ్‌కలెక్టర్ కేంద్రంగా, పార్లమెంటరీ నియోజకవర్గం కేంద్రంగా, అన్నమయ్య జన్మస్థలిగా అన్ని అర్హతలున్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా అతి సమీపంలోని తిరుపతి, కడప విమానాశ్రయాలు, ప్రధాన ముంబై-చెన్నై హైవేరోడ్డు, జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వనరులు రాజంపేటలో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కాశినాయన, బ్రహ్మంగారిమఠం, బద్వేల్, రాజంపేట, కోడూరుకు చెందిన 17 మండలాలు రాజంపేట డివిజన్‌లో ఉండేవన్నారు. అటువంటి డివిజన్‌లో గత జగన్ ప్రభుత్వం కుదించి ఈ ప్రాంతాన్ని గుర్తింపులేకుండా చేసి జిల్లా కేంద్రం కాకుండా చేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏర్పడిన జిల్లాలకు సంబంధించిన నూతన మంత్రివర్గ ఉపసంఘం తమ ప్రాంత మనోభావాలను గుర్తించి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేస్తూ విజ్ఞాపన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జిల్లా సాధన సమితి కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ నాయకుడు ప్రభాకర్‌నాయుడు, డిగ్రీ కళాశాలల జిల్లా అసోసియేషన్ అధ్య క్షుడు గీతాంజలి రమణ, వైద్య సంఘం నాయ కుడు డాక్టర్ నవీన్, ఆర్టీసీ యూనియన్ నాయకుడు చిన్నయ్య, కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, జనసేన పార్టీ నాయకుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

● 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29న విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి


రైతులకు వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి తదితరులు

నిమ్మనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల రైతులు ఉద్యానశాఖ ద్వారా అందుబాటులో వున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెంగంవారిపల్లి పంచాయతీలోని రైతులకు మామిడికాయలు కోసిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ, వంటి పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ రైతులకు పూల మొక్కలు, కూరగాయల వంటి పంటలు వేసిన రైతులకు మల్చింగ్ పేపర్‌లను సబ్సిడీతో రూ.8వేలకే సరఫరా చేస్తునట్లు తెలిపారు. అదే విధంగా నీటి నిల్వకుంటలకు 50 శాతం అనగా రూ.75 వేలను సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. పాలిహౌస్, షేడ్‌నెట్ హౌస్‌లను నిర్మించుకొనే వారికి 50శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. అనంతరం కలికిరి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, వాటిలో కొత్తచెట్లు నాటే రైతులు ట్రైనింగ్, ప్రూఫింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను దత్తత తీసుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్‌వో

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రతి ఉపాధ్యాయుడు దత్తత తీసుకోవాలని అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పీవీఎస్ కుమార్ తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10, ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యాశక్తి మెటీరియల్ అందరికీ అందించారా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం అందించిన హ్యాండ్ బుక్స్ ఆధారంగా విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎన్ఎంఎం పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పిల్లల హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. ఏఏఎంవో షమీ, ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యశాల వెటర్నరీ ఆఫీసర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

సిద్దవటం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించినందుకు ముమ్మడిగుంటపల్లె పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ బి.చంద్రకిషోర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. బుధవారం విజయవాడలోని పశువైద్యశాలలో సంచాలకులు దామోదర్ నాయుడు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న వెటర్నరి ఆఫీసర్ చంద్రకిషోర్

సెప్టెంబరు 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్

● పోటీలకు 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు అర్హులు
● పోస్టర్ ఆవిష్కరణలో డీఈవో సుబ్రహ్మణ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలు సెప్టెంబరు 11, 12వ తేదీల్లో రాయచోటి డైట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఉదయం డైట్‌లో కళాఉత్సవ్-2025 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, కళారూపాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని ఆయన వివరించారు. పోటీలను వ్యక్తిగత, బృంద విభాగాల్లో నిర్వహిస్తామ న్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఈ పోటీలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి 94402 46825ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబుయాదవ్, కేదార్‌నాథ్, శివప్రసాద్, కలీముల్లా, మోహన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

'ఆల్బెండజోల్‌తో ఉల్లాసం.. ఉత్సాహం'

ఒంటమిట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు మరణించి పిల్లలు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రవిబాబు తెలిపారు. బుధవారం ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులోని నులి పురుగులు మరణిస్తాయన్నారు. దీంతో ప్రజలు తినే ఆహారం శరీరానికి బాగా పడుతుందని, పిల్లలు ఎత్తు, బరువు పెరుగుతారన్నారు. నులిపురుగులు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ భావన, రమేష్, అరుణజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది నవీన్‌కుమార్, రామ్మూర్తి నాయక్, సునీల్, లక్ష్మీనరసమ్మ, భాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎం నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి



పులివెందుల సబ్‌డివిజన్‌లో...
పోలీసుల కొరత

- గాడి తప్పుతున్న శాంతిభద్రతలు
- పెరుగుతున్న నేరాల సంఖ్య
- ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే కానిస్టేబుల్

పులివెందుల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్‌డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో శాంతభద్రతలు గాడితప్పుతున్నాయి. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎప్పుడో ఏళ్లకాలం కిందట కేటాయించిన కేటాయింపుల్లోనే 60శాతానికి మించి పోలీసులు అక్కడ విధులు నిర్వహించడం లేదు. ముఖ్యంగా హెడ్‌కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఓ పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక కానిస్టేబుల్ పనిచేస్తున్నారు. పులివెందుల పట్టణంలో రాత్రిళ్లు కేవలం ఒకే ఒక బీట్ ఏర్పాటు చేయడం సిబ్బంది కొరతకు నిదర్శనం. దీంతో ఇటీవల పులివెందులలో క్రైమ్‌రేట్ పెరుగుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

పులివెందుల సబ్‌డివిజన్‌లో తొమ్మిది పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అందులో పులివెందులలో అర్బన్ పోలీస్‌స్టేషన్, వేంపల్లె, ఆర్కేవ్యాలీ, చక్రాయపేట, వేముల, వేంపల్లె, లింగాల, తొండూరు, సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లు సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్నాయి. వీటిలో సీఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు దాదాపు 229 మంది పనిచేయాల్సి ఉంది. కానీ 143 మంది మాత్రమే ఇక్కడ విధుల్లో ఉన్నారు. మిగిలిన 86 మందికి సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న 143 మంది పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్‌లో విధులు కూడా నిర్వహించడం లేదు. వీరిలో 33 మంది బయట ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. కొందరు కోర్టు కానిస్టేబుళ్లుగా, కొందరు ఎస్‌బీ తదితర కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్నారు. దీంతో పులివెందుల సబ్‌డివిజన్ పరధిలో పోలీసుల కొరత ఏ మేరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది.

- తొండూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తు న్నారు. ఇక్కడ 11 మంది పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఐదుగురు మాత్రం ఇక్కడ ఉన్నట్లు లెక్క. ఆ ఐదుగురిలో నలుగురు బయట ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఇదే పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు ఉన్నారు. అలాగే నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు.
- పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే 45 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉంది. అందులో 25 మంది మాత్రమే ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిలో పదిమంది బయట ప్రాంతాలలో పనిచేస్తున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఐదుగురికి గాను నలుగురు ఉన్నారు. ఏఎస్‌ఐలు నలుగురికి గాను ముగ్గురు ఉన్నారు. ఇద్దరు ఎస్‌ఐలు, సీఐ ఉన్నారు.
- వేంపల్లెలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు ఉన్నారు. ముగ్గురు ఏఎస్‌ఐలు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. 30 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా 17 మంది మాత్రమే ఉన్నారు. అందులో 9 మంది బయటిప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.
- చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. అలాగే 19 మంది కానిస్టేబుళ్లకు గాను 11 మంది ఉన్నారు.
- వేములలో 19 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా 11 మంది ఉన్నారు.
- సింహాద్రిపురం మండలంలో 17 మంది కానిస్టేబుళ్లకు గాను పది మంది ఉన్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ విషయానికొస్తే అక్కడున్న సిబ్బందిలో ఒక ఎస్‌ఐ మినహా మిగిలిన సిబ్బంది ఉన్నారు. ఇలా ఎప్పుడో ప్రభుత్వం కేటాయించిన పోలీసుల సంఖ్య ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం జనాభా పెరిగిన ఆ ప్రాతిపదికన పోలీసులకు కేటాయింపులు లేకపోగా ఎప్పుడో కేటాయించిన కేటాయింపుల ప్రకారం పోలీసు సిబ్బంది లేకపోవడం శాంతిభద్రతలకు విఘతం కలిగిస్తోందని చెప్పవచ్చు. ఇటీవల పులివెందుల పట్టణంలో వరుసగా సంఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. సిబ్బంది కొరత కారణంగానే శాంతిభద్రతలు గాడి తప్పుతు న్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

పులివెందులలో ఒక్క బీట్‌తోనే సరి

పులివెందుల పట్టణంలో పోలీసుల గస్తీ అనుక్షణం ఉండాలి. రాత్రి సమయంలో కనీసం మూడు నుంచి నాలుగుబీట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం ఒక బీట్‌తోనే సరిపెడుతున్నారు. దీంతో ఇటీవల ఇటీవల క్రైమ్‌రేట్ క్రమంగా పెరుగుతోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి అనడం గమనార్హం. పులివెందుల పట్టణంలో గొడవలు, హత్య, కిడ్నాప్ లాంటి వరుస సంఘటనలు చోటుచేసువడం దీనికి బలం చేకూరుస్తోంది.

మహిళ హత్యతో ఉలిక్కిపడ్డ పులివెందుల

పులివెందుల పట్టణం నడిబొడ్డున ఓ మహిళ హత్యతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే నాలుగు రోజుల క్రితం పదిరోజుల పసికందును ఓ మహిళ కిడ్నాప్ చేయడం కలకలం రేపింది. ఇక ఇటీవల పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకోవడం, పులివెందుల పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు మట్కా, గ్యాంబ్లింగ్ తదితరవి పెట్రేగిపోతున్నా పోలీసులు అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు లేకపోలేదు.

పోలీసుల వివరాలు కడపలో తెలుసుకోండి

పులివెందుల డివిజన్ పరిధిలో సిబ్బంది కొరత విషయమై డీఎస్పీ మురళీనాయక్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆయన ఈ వివరాలు మా వద్ద దొరకవని.. కడప డీపీఓ ఆఫీస్‌లో దొరుకుతాయని, అక్కడ అడగండని.. ఇక్కడ శాంతిభద్రతల వ్యవహారాలే చూస్తామని సెలవిచ్చారు.

25 తులాల బంగారు ఆభరణాలు చోరీ

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం మోక్షగుండం వీధిలో వుండే ఓ బంగారు అభరణాల తయారీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే మోక్షగుండం వీధిలో మాబూషరీఫ్ బాషా అనే వ్యక్తి తన ఇద్దరి సోదరులతో కలిసి బంగారు అభరణాల తయారీ దుకాణం నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దుకాణం మూసి భోజనానికి వెళ్లారు. భోజనం చేసి తిరిగి మాబూషరీఫ్ అతని సోదరులు దుకాణంకు రాగానే షట్టర్ పైకి లేపి వుండటం గమనించారు. షట్టర్ తీసి దుకాణంలో వస్తువులు పరిశీలించగా దాదాపు 25 తులాల మేర బంగారు అభరణాలు అపహరణకు గురయినట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు దొంగతనం జరిగిన బంగారు దుకాణం దగ్గరికి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి క్లూస్ టీంను వేలిముద్రల సేకరణ కోసం రప్పించారు. దుకాణంలో యజమానులను విచారించారు. చుట్టుపక్కల గల సీసీ కెమరాలను పరిశీలించగా.. ఓ గుర్తు తెలియని వ్యక్తి బంగారు అభరణాల దుకాణం షెట్టర్ తీసి లోపలికి వెళ్లి వచ్చినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

జమ్మలమడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచాల నవీన్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. జమ్మలమడుగులోని హరిజన కాలనీకి చెందిన నవీన్ సోమవారం రాత్రి పని నిమిత్తం స్కూటర్‌లో జమ్మలమడుగు-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో వెళుతున్నాడు. అక్కడ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఇనుప డ్రమ్ములను వర్షానికి కనపడకపోవడంతో ఢీకొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం జమ్మలమడుగుప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరుకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని తండ్రి జమ్మలమడుగు పట్టణంలో చెప్పులు కుట్టు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి పెద్ద కుమారుడు మృతితోబోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

స్థల విషయంపై పరస్పర దాడులు

- 20 మందిపై కేసు నమోదు

కాశినాయన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావిశెట్టిపల్లెలో బుధవారం ఓస్థల విషయమై ఎంబడి పోలయ్య, ఎంబడి సత్యరాజు అనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ పడ్డారు. దీంతో ఇరువురికి సంబందించిన వారు రెండు వర్గాలుగా విడిపోయి పరిస్పరం దాడులకు పాల్పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం రెండు వర్గాలవారు ఒకరిపై ఒకరు నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఎస్‌ఐ యోగేంద్ర పోలయ్యతో పాటు మరో ఆరుగురు, సత్యరాజ్‌తో పాటు మరో 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిపై దాడి... కేసునమోదు

కాశినాయన ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సావిశెట్టిపల్లెకు చెందిన ఎన్.విష్ణుతేజ అనే వ్యక్తిపై వినయ్ అనే యువకుడు అకారణంగా దాడిచేసి గాయపరచడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... బుధవారం విష్ణుతేజ అనే వ్యక్తి మేకలకు గడ్డికోసం డంపింగ్ యార్డు సమీపంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఇటుకులపాడుకు చెందిన రామయ్య తన ఆటోలో పూలకుండీలను గ్రామంలోకి తీసుకొచ్చాడు. ఈపూల కుండీలను ఆటో నుంచి శీను, యువ, వినయ్ అనే ముగ్గురు యువకులు దించే సమయంలో వినయ్ జారవిరచడంతో 4 కుండీలు పగిలిపోయాయి. ఆపక్కనే పొలంవద్ద ఉన్న విష్ణుతేజ అలా జారవిడస్తే రైతుకు నష్టం కాదా అన్నాడు. దీంతో ఆగ్రహించిన వినయ్ అతనిపై రాయితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు విష్ణుతేజ ఫిర్యాదు మేరకు వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘర్షణ - ఇద్దరికి గాయాలు

చాపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన వివరాల మేరకు... సోమాపురం గ్రామం వద్ద కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మిస్తున్నారు. ఈరోడ్డుకు ఇరువైపుల భూములకు కాలువలు ఏర్పాటు చేయాలని కొంతమంది రైతులు కోరగా.. మరికొందరు వద్దని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పైపులైను ఏర్పాటు చేసే నాలుగు సెంట్ల భూమి విషయమై ఇరువర్గాలు కట్టెలతో ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. దాడిలో భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి అనే ఇద్దరు వ్యక్తుల తల, చేతులకు గాయాలయ్యాయి. పైపులైను ఏర్పాటు చేయాలని ఈనెల 18న కలెక్టర్‌కు గ్రీవెన్‌సెల్‌లో వారు వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దారు రమాకుమారి సాయంత్రం 5 గంటల సమయంలో అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వారు గొడవపడ్డారు. గాయపడిన వారిని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- ఎస్‌సీ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. రైల్వే సిబ్బందికి సమయపాలన తప్పనిసరి అని స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి పర్యటనలో భాగంగా ఆయన కడప రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి.. అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా సహించేది లేదని, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు, కడప సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



కడప రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రైల్వే కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కడప బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని 2వ ప్లాట్‌ఫాం నుంచి రైల్వేకాలనీ వరకు విస్తరించాలని కోరారు. కాలనీలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ప్రధానంగా టీటీఈ గది కార్యాలయం పీడబ్ల్యూఐ కార్యాలయం కూడా అక్కడే ఉన్నాయని చెప్పారు. సిబ్బంది రైలు పట్టాలు దాటాల్సి రావడం వల్ల ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కాలనీ వరకు విస్తరిస్తే రైల్వే కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. రైల్వే క్వార్టర్స్ నిర్మించాలని, మరికొన్ని సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ కడప బ్రాంచ్ సెక్రటరీ ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాయస్వామి దేవస్థానానికి రూ.50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి

రాజుపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి పదవీ విరమణ పొందిన ఐపీఎస్ అధికారి రవీంద్రబాబు రూ.50వేలు విరాళం అందజేఅరు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా సంజీయరాయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారి శేష వస్త్రాలు, మెమోంటోలు రవీంద్రబాబుకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ పీజీలో 975వ ర్యాంకు



సీకేదిన్నె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుసిరెడ్డిపల్లెకు చెందిన గజ్జెల శ్రావణి మెడికల్ పీజీ ఎంట్రెన్స్‌లో 975వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌పూర్తి చేసిందన్నారు. పీజీ ఎంట్రెన్స్ రాయగా జాతీయస్థాయిలో 975వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. తండ్రి ఆంజనేయరెడ్డి హెడ్‌కానిస్టేబుల్‌గా 11వ బెటాలియన్‌లో పనిచేస్తున్నారు.

దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు అవకాశం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ల అప్పీళ్లకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అనర్హులుగా నోటీసు అందుకున్న వారు వికలత్వ పింఛన్లకు తాము అర్హులమని భావిస్తే తమకు సమీపంలోని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరును సంప్రదించి అర్జీలు సమర్పించవచ్చన్నారు. ఆ అర్జీని పరిశీలించి వికలత్వం పింఛను పరిశీలనకు పరిశీలిస్తారన్నారు. వికలత్వ పునఃపరిశీలన చేసేందుకు షెడ్యూలు ప్రకారం అర్జీదారులకు కేటాయించిన తేదీల్లో నిర్దేశించిన ఆసుపత్రిలో హాజరు కావాలని కోరుతూ తదుపరి నోటీసు జారీ చేస్తారన్నారు. వివరాలకు సమీపంలోని గ్రామవార్డు సచివాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

26న ఐటీఐ అడ్మిషన్లకు గడువు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయడానికి ఈ నెల 26న గడువు ఉందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ అసిస్టెంటు డైరెక్టరు రత్నరాజు ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మిషనిస్ట్, మోటరు మెకానిక్, డీజలు మెకానిక్, వెల్డర్ కార్పెంటరు తదితరాలకు ఖాళీగా ఉన్న సీట్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారు పాస్‌పోర్టు సైజు గల ఫొటో, తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు విద్యార్థి ఆధార్‌కార్డు కూడా తీసుకుని నేరుగా ఐటీఐ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ డీఎల్‌పీసీ ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

పోలీసుస్టేషన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌కు హాజరయ్యారు. ఇటీవల పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఎంపీ అవినాశ్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా పోలీసు వాహనాలను అడ్డుకోవడంతో పాటు ధర్నా నిర్వహించారు. దీనిపై ఎర్రగుంట్ల పోలీసు స్టేషన్‌లో డాక్టర్ సుధీర్‌రెడ్డి, మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయన్ను అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వాయిదా నిమిత్తం ఆయన బుధవారం ఎస్‌ఐ వద్ద హాజరయ్యారు. ఈ కేసును మళ్లీ 25వ తేదీకి వాయిదా వేస్తూ పోలీసులు నోటీసులు ఇచ్చారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించేందుకు యత్నాలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా.. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో రాష్ట్రమంతటా టిడ్కో ఇల్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో కొర్రపాడు రోడ్డులో నిర్మించి మధ్యలో ఆపేసిన టిడ్కో గృహాలను కమిషనర్ రవిచంద్రారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రమోహన్‌తో బుధవారం కలిసి పరిశీలించారు. దాదాపు మూడు బ్లాకులలో 144 ప్లాట్లకు స్లాబులు పూర్తయిన దశలో ఉన్నాయని గుర్తించారు. వీటికి అవసరమైన మౌలిక సదపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లపై కమిషనర్ సమీక్షించారు. త్వరలో అక్కడ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు

'అమ్మ మనసు' కథల సంపుటి ఆవిష్కరణ



కేతు పద్మావతి కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సృష్టికి మూలమైన అమ్మ మనసును విశిష్టమైన పంథాలో కేతు పద్మమ్మ అద్భుతంగా ఆవిష్కరించారని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి కొనియాడారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సింగపూర్ సిటీలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సతీమణి కేతు పద్మావతి రాసిన అమ్మ మనసు కథల సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం కుటుంబం నడుపుకోవడంతోనే మహిళల జీవితాలు గడిచిపోతున్నాయని.. అలాంటి పరిస్థితుల్లో రాయలసీమ నుంచి మహిళా కథకులు తయారు కావడం అభినందనీయమన్నారు. కేతు విశ్వనాథరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ.. ఆమె తన జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను కథలుగా రాయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రామమునిరెడ్డి, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు శశికాంత్‌రెడ్డి, జిల్లా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేతు పద్మావతిని సత్కరించారు.

పెనికెలపాడు చెరువుకు నీటి కోసం పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఈఈ ఉమామహేశ్వరరావు

ముద్దనూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెనికెలపాడు చెరువుకు గాలేరు నగిరి కాల్వ నుంచి నీటిని మళ్లించేందుకు బుధవారం జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం పెనికెలపాడు, రాజుల గురువాయపల్లె, నొస్సంవారిపల్లె, రాఘవాపురం గ్రామాల రైతులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి సాగు, తాగునీటి కోసం పెనికెలపాడు చెరువుకు నీటిని అందించాలని విన్నవించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జీఎన్ఎస్ఎస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కాల్వ నుంచి గేటు సిస్టమ్ ద్వారా వంక నుంచి నీటిని చెరువుకు తరలించవచ్చని తెలిపారు. ఈ మేరకు అధికారులు స్పందించినట్లు రైతులు తెలిపారు. అలాగే వేల్పుచర్ల చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించేందుకు కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ సుదర్శన్, మాజీ డీసీసీబీ చైర్మన్ కాటమయ్య, రైతులు పాల్గొన్నారు.

ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తపాల బిల్లుల సేకరణ (ఫిలటరీ) అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత తపాలా శాఖ ద్వారా ప్రవేశపెట్టిన దీన్ దయాల్ స్పర్శ్ యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జీ.కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతియేటా చదువులో మంచి ప్రతిభ కనపరుస్తూనే ఫిలటరీని అభివృద్ధిగా కొనసాగించే 6, 7 , 8, 9వ తరగతి విద్యార్థులకు సర్కిల్‌స్థాయిలో ఫిలటరీ ప్రాజెక్టు స్వీచ్, పరీక్షల ఆధారంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్న విషయం ప్రజలకు విదితమే. ఇందులో భాగంగానే 2025-26 సంవత్సరానికిగాను దీన్ దయాల్ స్పర్శ్‌యోజన ఫిలటరీ స్కాలర్‌షిప్ పథకం నోటిఫికేషన్‌ను భారత తపాలా శాఖ విడుదల చేసిందన్నారు. పరీక్షలలో అర్హత సాధించి ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6వేలు ఇస్తామని తెలిపారు. ఈనగదును విద్యార్థి తల్లిదండ్రుల ఉమ్మడి ఐపీపీబీ పోస్టల్ ఖాతాలో జమ చేస్తారని, విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విజయవాడ పోస్టు.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను వీక్షించవచ్చని, లేదా దగ్గరలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

శక్తి యాప్ ప్రయోజనాలపై అవగాహన అవసరం

- మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య

రాయచోటిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా భయపడకుండా ఎదుర్కొనేలా సిద్ధం కావాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జీ.శంకరమల్లయ్య బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. శక్తియాప్ ప్రయోజనాలు, శక్తి టీం పనిచేసే విధానం వివరించారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు మహిళలు తమను తాము రక్షించుకునేందుకు ఉపయోగపడే టోల్ ఫ్రీ నెంబర్లను తెలియ జేశారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏ ఆపదలోనైనా 112 కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 నెంబర్ తెలియ జేయాలన్నారు. ఉమన్ హెల్ప్ లైన్, బాల్యవివాహాలు మొదలగు వాటికి 181 డయల్ చేయాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల రక్షణ, భద్రత కోసం 1098 నెంబర్‌కు తెలపాలన్నారు. డ్రగ్స్‌టోల్ ఫ్రీ నెంబర్ 1972 మొదలగు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, రాయచోటి సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది సాగర్‌రెడ్డి, సురేఖ, పీరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్రః7382114647.
AJA- 237946

PLOTS FOR SALE
నేషనల్ హైవే IIT దగ్గర అంతరిక్ష పరిశోధన కేంద్ర అడ్మినిస్ట్రేషన్ ఆఫీసు ప్రక్కన ఫామ్ ల్యాండ్ 52 ఎకరాలలో ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్ ప్లాట్లు. ఫోన్: 95027 74175, 79959 92114.
AJT -1543

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

కలికిరికి 'జాతీయ రహదారి' కష్టాలు

మండల సమావేశంలో సమస్యల ఏకరువు ● నేషనల్ హైవే అధికారుల అనాలోచిత చర్యలపై సభ్యుల ధ్వజం

● హైవే నుంచి ఎంట్రీ, ఎగ్జిట్, ఫ్లైఓవర్‌కు ఇరువైపులా విద్యుద్దీపాల ఏర్పాటుపై తీర్మానం



సమస్యలను ఏకరవు పెడుతున్న సర్పంచు వెంకట రెడ్డి

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం ఉపయోగపడాల్సిన జాతీయ రహదారి మండల వాసులకు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. బుధవారం ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో పలువురు సభ్యులు జాతీయ రహదారుల సంస్థ అనాలోచిత చర్యలను దుయ్యబట్టారు. మదనపల్లె-పీలేరు మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారితో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుట్టపాలెం సర్పంచు ఆర్.వెంకట రెడ్డి, పత్తేగడ ఎంపీటీసీ కృష్ణయ్య ఏకరువు పెట్టారు. ఈ రహదారి ప్రారంభించినప్పటి నుంచీ కలికిరి క్రాస్ రోడ్డుకు రావలసిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ హైవే పైనే వెళుతుండడం తీవ్ర సమస్యాత్మకంగా మారిందని వివరించారు. తిరుపతి టు మదనపల్లె, ఇటు మదనపల్లె టు తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ కలికిరి క్రాస్ రోడ్డులో స్టాపింగ్ వున్నా ఇటువైపుగా రావడం లేదన్నారు. ఆర్టీసీ అధికారులు కనీసం కలికిరి క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లి తీరాలని పదే పదే ఆదేశాలిస్తున్నా హైవే నుంచి సర్వీసు రోడ్ల మీదికి ఎగ్జిట్, ఎంట్రీ లేకపోవడంతో వీలుకావడం లేదన్నారు. నిబంధనల ప్రకారం కలికిరి రాయచోటి రోడ్డులోని ఫ్లైఓవర్‌కు రెండు వైపులా ఎంట్రీ, ఎగ్జిట్ ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని దుయ్యబట్టారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పలువురు సభ్యులు, అధికారులు వీరి వాదనలతో ఏకీభవించారు. కీలకమైన ఎంట్రీ, ఎగ్జిట్ సహా ఫ్లైఓవర్‌కు ఇరువైపులా విద్యుద్దీపాలను ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. రహదారి పనులు పూర్తి కాకుండానే కేవలం టోల్ వసూళ్ల కోసం రోడ్డును ప్రారంభించారని ఎత్తి చూపారు. మండలంలోని చెరువుల నుంచి మట్టి, గుట్టలు చదును చేసి కంకర, ఇసుకలాంటి సహజవనరులన్నీ ఉపయోగించుకుని చివరికి మండల ప్రజలకు కొత్త సమస్యలను తెచ్చిపెట్టడం ఎంత మాత్రం సమంజసమని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీడీఓ జోక్యం చేసుకుని సభ్యులు ప్రతిపాదిస్తే సమావేశం తీర్మానిస్తుందని హామీ ఇచ్చారు. ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీసు రోడ్ల పైకి ఎంట్రీ, ఎగ్జిట్ సౌకర్యం, విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సచివాలయం-3 వద్దకు మార్చినట్లు ఎంఏఓ హేమలత తెలిపారు. అన్నదాత సుఖీ భవ అందని వారి ఖాతాల లోటుపాట్లను సరిచేసి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మండలానికి రెండు డ్రోన్‌లు మంజూరయ్యాయని రైతులు వీటిని వినియోగించుకోవాలని కోరారు. అనర్హులుగా తేల్చిన పింఛనుదారులు తిరిగి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో ఏఓ సురేంద్రబాబు, సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాలతి పాల్గొన్నారు. మండల అధికారులు డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ కీర్తన, డీటీ వెంకట్రమణా రెడ్డి, ఏఓ హేమలత, ఏఈలు చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ముజిబుర్ రహ్మాన్, మంజుల, సర్తాజ్, నాగార్జున, దేవసేన, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు హాజరయ్యారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

● అధికారులతో కలిసి తాగునీటి ట్యాంకుల స్థలాల పరిశీలించిన కంభం నిరంజన్‌రెడ్డి



ట్యాంకుల స్థలాలు పరిశీలిస్తున్న కంభం నిరంజన్‌రెడ్డి, అధికారులు

వాల్మీకిపురం, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం నిమిత్తం రూ.2750 కోట్లతో పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు గండికోట రిజర్వాయర్ నుంచి తాగునీటిని అందించే పథకానికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించినట్లు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జగనన్న కాలనీ, చింతపర్తి తదితర ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల స్థలాలను పరిశీ లించిన ఆయన ఆర్‌డబ్ల్యూ అధికారులతో కలిసి పైప్‌లైన్ల నిర్మాణం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 54 కిలోమీటర్ల మేరకు నూతన నీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టి గండికోట రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన తాగునీటి పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు. మదనపల్లె డివిజన్‌లో దశాబ్దాలుగా ఉన్న తాగు నీటి సమస్య పూర్తి స్థాయిలో తీర్చేలా పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శైలేంద్ర, ఏఈ హరిత, ఎంపీడీఓ మనోహర్‌రాజు, తహసీల్దార్ పామిలేటి, మార్కెట్ చైర్మన్ చంద్రమౌళి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జు నరెడ్డి, నేతలు నారాయణ, శేషాద్రి రెడ్డి, రాజేంద్రాచారి, సయ్యద్ బాష, మురళి, రాజగోపాల్, డిష్‌బ్రదర్స్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి



ములకలచెరువు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బురకాయలకోట టీడీపీ సీనియర్ కార్యకర్త పోలేపల్లి శంకర్‌రాజు(63) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఇంటివద్ద ఉన్నట్లుండి కుప్పకూలి పడిపోవడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లెకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల టీడీపీ నేతలు ముత్తుకూరు మౌల, జేసీబీ సుధాకర్ నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు, మురళీస్వామి, గోపాల్‌రాజు, ఫజులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కుంభాభిషేకంలో చండీ పారాయణం



హోమంలో సతీసమేతంగా ఆలయ ధర్మకర్త అశోక్ కుమార్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవతకు 12 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న మూడు రోజుల మహా కుంభాభిషేకం రెండో రోజు బుధవారం ఆలయంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ సూర్యారాధన, కలశ స్థాపన, అమ్మ వారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, శాంతి హోమాలు వైదిక సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. కలశార్చన, చండీ పారాయణ దీక్షా హోమం, అష్టావధాన సేవ పూర్తి చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త అశోక్‌కుమార్ రెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా నా కక్షిదారు మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లి. పుంగనూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం ఈ క్రింది కనిన పెద్దులు దాఖలు స్థిరాస్తి అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం, మదనపల్లె బోస్టు మరియు టౌన్, సప్తగిరి నగర్, డోర్‌నెం.3-145-6-13-2 నందు కాపురముండు శ్రీ సి.శ్రీనివాసులు, తండ్రి లేట్ పెద్ద రెడ్డెప్ప గారికి చెందిన ఆస్తి అని, సదరు ఆస్తిని రిజిస్టరు సేర్రఇంచుకొన్నారు. కావున సదరు వ్యవహారము సంబంధించి ఈ క్రింద కనిన పెద్యూలు దాఖల ఆస్తిపై ఎటువంటి జప్తులు, దావీలు, క్లైములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నఎడల నేటినుండి 7 దినముల లోగా ఈ క్రింది కనిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

SCHEDULE OF PROPERTY

Chittoor District, Madanapalle Sub District, Madanapalle Mandal, belongs to Raamadaarlapalle Gramapanchayathi, in Papayyagaripalle Village Khsba, Vacant site, as per the ROR 1B Khatha No. 103 issued by the Madanapalle Tahasildar, Dry, Survey No. 14-2A1 and as per the ROR 1B Khatha No.116 issued in favour of 2nd party in the said deed Survey No.14- 2A2, L.P.No.30, Ac.0.99 cents in this Plot No.10.

Measuring: East-West on Northern side : 67.2feet (20.48 Mtrs), East-West on Southern side : 67.9 feet (20.66 Mtrs), North-South on Eastern side : 30 feet (9.15 Mtrs), North-South on Western side : 30 feet (9.15 Mtrs) Total 2023.65 Sq.ft or 224.85 Sq. Yrds.

Within the following boundaries: East:25 feet Road,West:Land of K. Ramachandra, North : Vacant site of Plot No.9, South:- Vacant site of Plot No.11.

C.V. SREENIVASULU, B.A.,L.L.B., Advocate, Punganur- 517 247

టీడీపీ నేత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జోళపాలెం టీడీపీ నేత వెంకటరమణ కుటుంబాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పరామర్శించారు. వెంకటరమణ భార్య రమణమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే రమణమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కూడా సంతాపం తెలుపుతూ వెంకటరమణకు ధైర్యం చెప్పారు. చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్, రైస్‌మిల్ శశి, దొరస్వామి నాయుడు, బీజేపీ నేత శ్రీకాంత్ వున్నారు.


వ్యవసాయంలో సేంద్రియ ఎరువులు వాడాలి



పొలం పిలుస్తోందిలో ఏడీఏ నాగప్రసాద్

గుర్రంకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రైతన్నలు సేంద్రియ ఎరువులను వాడితే మంచి దిగుబడి పొందవచ్చని ఏడీఏ నాగప్రసాద్ అన్నారు. తరిగొండ, ప్యారంపల్లెలో పొలంపిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించడంతో ఎరువుల మోతాదు తెలుసుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, ఏఈఓ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.





వర్షాలతో నష్టం జరగకుండా సూచనలు

కలికిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వివిధ రకాల పంటలను కాపాడుకోవడంలో రైతులను అప్రమత్తం చేయడానికి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో తిరుపతి పరిశోధనా స్థానం, జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తల బృందం రెండు రోజులుగా పంట పొలాలను పరిశీలించే పనిలో పడ్డారు. ఈ మేరకు పలురకాల పంటలను పరిశీలించి దిగుబడులపై వర్షాల ప్రభావం పడకుండా జాగ్రత్తలను రైతులకు వివరించారు. మర్రికుంటపల్లె, మేడికుర్తి, కేవీపల్లె మండలంలోని తిమ్మాపురం, పీలేరులోని జంగంపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. వరిలో జీవన ఎరువులు వినియోగించాలని సూచించారు. వేరుశనగ పంటలో మొవ్వకుళ్లు, కాండంకుళ్లును గుర్తించి మొక్కలను పీకేసి కాల్చివేయాలన్నారు. వేరుశనగ కలుపు తీసే సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సమ్ వేయాలని సూచించారు. టమోటా పంటలో ఆకుమాడు తెగులు సోకిందని నివారణగా టేబుకొనజోల్, ట్రైఫాక్సీ స్ట్రోబిన్‌లను 0.7 గ్రా. వంతున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బూడిద తెగులు నివారణకు లీటరు నీటిలో మైక్లోబుటానిల్ మందును 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలన్నారు. పంటల పరిశీలనలో కోఆర్డినేటర్ మంజుల, శాస్త్రవేత్తలు సీహెచ్ భార్గవరామి రెడ్డి, సహజదేవ, పి.రామకృష్ణ, ఎంఏఓ హేమలత, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాకిమారుపల్లెలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సంపతికోట కిట్టన్న

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకిమారుపల్లెలో రెండు రోజులుగా గ్రామస్తుల సహకారంతో కొత్తగా సీతా లక్ష్మణాంజనేయస్వామి సమేత శ్రీరామచంద్ర మూర్తి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

పథకాలు, బోధనల నివేదికలు రూపొందించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, మిడ్ డే మీల్స్, పాఠ్యాంశాల బోధనలపై పూర్తి వివరాలతో నివేదికలు అందివ్వాలని విద్యాశాఖ ఏఎల్ఎస్ వెంకటరామయ్య, సీఎంఓ కరుణాకర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో వారు మాట్లాడుతూ పాఠశాలకు హాజరు కాకుండా వున్న విద్యార్థులను గుర్తించి, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎఫ్ఏ 1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీఓ కృష్ణయ్య ఎంఈఓ-2 రాజగోపాల్, సీఆర్‌సీ హెచ్ఎం శ్రీనివాసులు, రామాంజులు పాల్గొన్నారు.

'ఎంబీకే 2.0'పై అవగాహన కల్పించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘ సభ్యులకు ఎంబీకే 2.0 మొబైల్‌యాప్‌పై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఏరియా కోఆర్డినేటర్ సాంబశివ పేర్కొన్నారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కిజర్ అహ్మద్ ఆధ్వర్యంలో సంఘ మిత్రలకు, వీఓ లీడర్లకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సంఘాల సభ్యుల వివరాలు, పొదుపు, రుణాలు, చెల్లింపులు, సమావేశాలకు హాజరు తదితర విషయాలను ఎంబీకే(మొబైల్ బుక్ కీపింగ్) ద్వారా నిర్వహించేవారని, ఇప్పుడు ప్రభుత్వం, సెర్ప్ కలిసి ఎంబీకే 2.0 వెర్షన్ ప్రవేశపెడుతున్నారన్నారు. ప్రతి గ్రూపులోని సభ్యురాలికి ఈ యాప్ డౌన్‌లోడ్ చేయించి వారికి ఒక యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఇస్తారన్నారు. అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ప్రతి సంఘమిత్ర, వీఓ లీడర్ ఎంబీకే 2.0, మన డబ్బు మన లెక్కలు యాప్‌పై అవగాహన పెంచుకుని, వాటిని సంఘాల్లోని సభ్యురాళ్లకు తెలియజేయాలన్నారు. నిమ్మనపల్లె ఏపీఎం మురళి, డీపీఎం గంగాధర్, ములకలచెరువు క్లస్టర్ ఏపీఎంలు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

కురబలకోట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతున్న చిన్నారికి టీడీపీ నేత కొణిదల లోకేష్ ఆర్థిక సాయం అందించారు. కురబలకోట వాసి ఇమామ్ కుమార్తె అల్పియా కిడ్నీ వ్యాధితో బెంగళూరు ప్రై వేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాష్ట్ర హజ్ కమిటీ బోర్డు డైరెక్టర్ తాజ్ ఖాన్, రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రజనీకుమారి అన్నారు. స్థానిక కార్యాలయంలో సంఘమిత్రలు, సీఆర్పీలు, గ్రూప్ సభ్యులతో బుధవారం సమావేశమైన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల కోసం అమలు చేస్తున్న బ్యాంక్ రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అర్హులకు పథకాలు వర్తించేలా పని చేయాలని తెలిపారు. బ్యాంక్ అధికారులు వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

బి.కొత్తకోట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని బీరంగి పంచాయతీ శంకరాపురంలో వెలసిన శంకరయ్య స్వామి ఆరాధనోత్సవాలు 21 నుంచి 24 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. 21న కలశస్థాపన, గనపతిహోమం, నవగ్రహశాంతి, పూజా కార్యక్రమాలుంటాయన్నారు. 22 నుంచి స్వామివారికి అభిషేకాలు, సహస్రనామార్చన, భజనకార్యక్రమాలతో పాటు చెక్కభజన, కోలాటం, అన్నసంతర్పణ ఉంటాయన్నారు. భక్తాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పీలేరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసినట్లు రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషా వలి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్త్రీశక్తి పథకం నేపథ్యంలో పట్టణంలోని ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు లాభదాయకమే అయినా ప్రయాణీకుల ద్వారా జీవనో పాధి పొందే ఆటో డ్రైవర్ల మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. ఇప్పటికే చాలా మంది ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు నెలవారీ వాయిదాలు, బీమా కట్టలేక, ఎఫ్‌సీలు చేయించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 4 లక్షల కుటుంబాలు ఆటోల మీద ఆధారపడి జీవిస్తున్నాయని, వారందరి గురించి ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. యూనియన్ నేతలు రమణ నాయక్, సయ్యద్, హరినాథ, సుబ్రహ్మణ్యం, రవి, ఖాజా, మాధవరెడ్డి, చక్రపాణి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ లే-అవుట్లను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ లే-అవుట్‌ను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. రాచవేటివారిపల్లి పంచాయతీలో నిర్మిస్తున్న లే-అవుట్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ లే-అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అదనంగా డబ్బు మంజూరు చేసినా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుని ఇంటికి తిరిగి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారుల్లో చైతన్యం తెచ్చి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఏఈ అమరనాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మల్బరీసాగుతో లాభాలు పొందండి

బి.కొత్తకోట, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): రైతులు మల్బరీ సాగు చేసి అధిక లాభాలు గడించవచ్చని సెరికల్చర్ శాస్త్రవేత్త తిరుపతయ్య పేర్కొన్నారు. వ్యవసాయ కార్యాలయంలో కేంద్ర పట్టు పరిశోధన, శిక్షణాసంస్థ ఆధ్వర్యంలో పట్టురైతులకు 'మేరా రేషం..మేరా అభిమాన్' శిక్షణ నిర్వహించారు. సీనియర్ సైంటిస్టులు డా.శైలజ, డా.పురుషోత్తం పట్టుసాగులో ఆధునిక పద్దతులు, మార్కెటింగ్, యాజమాన్య విధానాలపై అవగాహన కల్పించారు. తక్కువ కాలంలో చేతికి వచ్చే పంట మల్బరీ, ఎకరా సాగుతో ఏడాదికి రూ.4లక్షలు సంపాదించవచ్చన్నారు. హార్సిలీ హిల్స్ వద్ద సిరికల్చర్ ఫారంలో మొక్కలు లభిస్తాయన్నారు. షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమతులు తప్పనిసరి : డీఎస్పీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక ప్రతిమల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వేదిక నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం, ఊరేగింపు సమయంలో రాజకీయ ప్రేరేపిత ప్రకటనలు చేయరాదని, అశ్లీల నృత్య ప్రదర్శనకు అనుమతి లేదన్నారు. మండపాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని, ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు తప్పక రాత్రిళ్లు అక్కడే ఉండాలన్నారు. సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో నిర్వాహకులు ప్రతిమల వివరాలు, నిమజ్జనానికి వినియోగించే వాహనం, నిమజ్జనం చేసే ప్రదేశం తెలుపుతూ అనుమతులు పొందాలన్నారు. నిమజ్జన సమయంలో వాహన డ్రైవర్ మత్తు పదార్థాలు వాడరాదని, పోలీసులు నిర్దేశించిన మార్గంలో ఊరేగింపు చేసుకోవాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే విలేజ్ పోలీసులకు తెలపాలని, లేక సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు తీసుకోబోయే చర్యలకు బాధ్యులు అవుతారన్నారు. తాలుకా, వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు కళా వెంకటరమణ, మహమ్మద్ రఫీ, రాజారెడ్డి, ఎస్ఐలు అన్సర్‌బాషా, రహింతుల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తి పాటలే పెట్టాలి

పెద్దమండ్యం, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): వినాయక చవితి పండు గ సందర్భంగా వేదిక వద్ద భక్తి పాటలే పెట్టాలని పెద్దమండ్యం ఎస్ఐ వెంటేశ్వర్లు పేర్కొన్నారు. వినాయక ప్రతిమల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్ఐ ఆధ్వర్యంలో అధికారులు, మండల ప్రజలతో సమావేశమైన ఎస్ఐ మాట్లాడుతూ వినాయక మండపంలో భక్తి పాటలు మాత్రమే పెట్టుకోవాలన్నారు. తహసీల్దార్ తేజశ్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సిద్దవరం ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగధరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌వలి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, మండల జనసేన అధ్యక్షుడు శంకర, అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల సిబ్బంది పీలేరులో దోమల నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దోమలతో వచ్చే మలేరియా, డెంగీ, గున్యా, మెదడు వాపు వ్యాధి, బోదకాలు వంటి వ్యాధుల గురించి తెలియజేశారు. దోమల కాటు నుంచి రక్షించుకోవడమే కాకుండా వాటి సంతానోత్పత్తిని సమూలంగా నిర్మూలించాలని వివరించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి సాధించాలి



హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఓ దామోదర్‌రెడ్డి

పెద్దమండ్యం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి సాధించడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా సోసెల్ వెల్ఫేర్ డీడీ, పెద్దమండ్యం మండల ప్రత్యేకాధికారి దామోదర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలో బుధవారం పర్యటించిన ఆయన ప్రభుత్వ మోడల్ స్కూల్, కాలేజి, ప్రభుత్వాస్పత్రి, ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. మోడల్ స్కూల్, హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలన్నారు. హాస్టల్ నిర్మించిన బాత్‌రూం గుంతలు తరుచూ నిండుతూ దురవాసన వెదజల్లుతోందని హాస్టల్ విద్యార్థినులు తెలిపారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డాక్టర్ అశోక్, ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, జనార్ధన, జగన్, బాలాజీ, శైలజ, శేషాద్రి, గోవర్దన, వరప్రసాద్ నాయక్, మంజుభార్గవి, ఖాదర్‌బాష, లక్ష్మీప్రసన్న, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

మదనపల్లె టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు, యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. బుధవారం సబ్‌కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్లు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచీ ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారన్నారు. వీరిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర అమలు చేయాలన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముబారక్ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను మదనపల్లె ఆర్టీఓ కార్యాలయంలోనే మంజూరు చేయాలన్నారు. బీఎంఎస్ కార్యదర్శి రెడ్డిబాషా, వేణుగోపాల్‌రెడ్డి, యూనియన్ నేతలు వెంకటేశ్, మస్తాన్, అస్లాం, మహమ్మద్, కరీముల్లా, రమణ నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ

తంబళ్లపల్లె, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో బుధవారం సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. మల్లయ్యకొండ మాజీ చైర్మెన్ కనుగొండ మద్దిరెడ్డి సొంత నిధులతో పాఠశాలలో సరస్వతీ దేవి ఆలయాన్ని నిర్మించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మద్దిరెడ్డి, పద్మావతమ్మ దంపతులు ఎంఈఓ నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.